Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 17 సంచిక: 24 కరీంనగర్ గురువారం 18 జూన్ 2026 పేజీలు: 12 వెల: 2.00


## కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రిలో దారుణం

**- నర్స్ కాన్పు చేయడంతో తల్లీబిడ్డా మృతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, జూన్17 : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం జరిగింది. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఓ నర్సు కాన్పు చేసింది. కానీ ప్రసవం అనంతరం తల్లీబిడ్డ మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. గుండాల మండలం శంభుని గూడెం గ్రామానికి చెందిన గర్భిణి వనజ (20)కు పురిటి నొప్పులు రావడంతో గుండాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ సమయంలో ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో లేరు. దీంతో

11లో

## ఆరుట్లలో సరదాగా గడిపిన సిఎం రేవంత్

**- విద్యార్థులతో కలసి బ్రేక్ ఫాస్ట్..**

**- ఫుట్ బాల్ ఆడి విద్యార్థుల్లో ఉత్సాహం నింపిన సిఎం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రంగారెడ్డి, జూన్17 : రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. బుధవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో జిల్లాకు చేరుకున్న సీఎం.. హెలిప్యాడ్ నుంచి తెలంగాణ పబ్లిక్ స్కూల్ వరకు పాఠశాలకు చెందిన బస్సులో ప్రయాణించారు.

11లో






## ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం

# నామోషీ కాదు

**- ఆ భావన నుంచి అంతా బయటపడితే మంచిది**

**- ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం**

**- సర్కార్ బడుల నుంచే ఐఎఎస్, ఐపిఎస్‌లు వచ్చారు**

**- అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు**

**- కులమాతలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం**

**- ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్**

**- స్కూల్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రంగారెడ్డి, జూన్ 17 : ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ,

11లో





## రాష్ట్రంలో సంక్షేమం లేదు...

# అంతా సంక్షోభమే

**- దండుపాళ్యం బ్యాచ్ రాష్ట్రాన్ని దోచుకుంటోంది**

**- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి సున్నా**

**- ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కెసిఆర్ మళ్లీ సిఎం**

**- సర్‌పై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల్సిందే**

**- పాలేరు నియోజకవర్గ బూత్ కార్యకర్తల భేటీలో కెటిఆర్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 17 : రాష్ట్రంలో సంక్షేమం లేదని.. ఎక్కడ చూసినా కూల్చివేతలే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయారంటూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో బూత్‌లెవల్ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమీషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని.. వారికి కనీసం యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పు..కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బూత్‌ల వారీగా బలమైన కార్యకర్తల నిర్మాణం జరగాలని కేటీఆర్ అన్నారు. సర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని.. దేశంలో ఇప్పటికి 13 సార్లు జరిగిందని.. ఇప్పుడు 14వ సారి అని తెలిపారు. సర్‌ను పట్టించుకోక పోతే నష్టం తప్పదన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల25 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్క అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఇది చాలా కీలకమైన సమయమని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలన్నారు. 'నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఈరోజు 100 సీట్లతో గెలుస్తారు.. నిజాయతీగా గెలవాలంటే మనం జాగ్రత్తగా ఉండాలి' అంటూ కార్యకర్తలకు కేటీఆర్

11లో

## ఇరాన్ యుద్ధంతో ఇంధన సంక్షోభంలో ప్రపంచం

**- ఆర్థికంగా వెనకబడ్డ దేశాలను ఆదుకోవాలి**

**- జి-7 సైదస్సులో ప్రధాని మోదీ వెల్లడి**



(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

ప్యారిస్, జూన్ 17 : ఫ్రాన్స్‌లోని ఎవియాన్-లే-బేలో బుధవారం జరిగిన జీ-7 కూటమి దేశాల సమావేశంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. జీడీపీ, వాణిజ్య గణాంకాలను దాటి, ఆర్థిక వృద్ధిపై చర్చలు ఉండాలన్నారు. 'అందరికీ సమాన, స్థిర ఆర్థిక వృద్ధి అంశం'పై చర్చ జరపడం మంచి విషయమన్నారు. వృద్ధి గురించి ప్రస్తావన వస్తే.. జీడీపీ, వాణిజ్య గణాంకాలు ప్రధానంగా ఉండకూడదు. ఎవరిది వృద్ధి..ఎవరికి వృద్ధి.. అది ఏ దిశలో ఉంది.. అనే అంశాలను చర్చించాలని మోదీ పేర్కొన్నారు. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభంలో

11లో

## సిఎం రేవంత్‌తో ఈషాసింగ్ భేటీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, జూన్ 17 : మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత ఈషా సింగ్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ (రైఫిల్/పిస్టల్) 2026 పోటీల్లో స్వర్ణం సాధించి ప్రపంచ రికార్డు కైవసం చేసుకున్న నేపథ్యంలో ఈషా సింగ్ ని సిఎం రేవంత్ అభినందించి, సత్కరించారు.

## మైనర్ బాలికపై అత్యాచారం..హత్య

**- పోక్సో కేసులో 20ఏళ్లు...హత్య కేసులో యావజ్జీవం**

**- నిందితుడికి శిక్ష విధించిన సిరిసిల్ల పోక్సో కోర్టు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, జూన్ 17 : మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పోక్సో కేసుతోపాటు, అదే బాలికను హత్య చేసిన కేసులో నిందితుడు బండపల్లి నవీన్ కుమార్ (27)కు పోక్సో కేసులో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ బుధవారం

11లో

## రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**- వారు ఆర్థికంగా ఎదగాలన్న దిశగా కృషి**

**- పేదలు సన్నబియ్యం తినాలి..రైతులు ఆర్థికంగా ఎదగాలి**

**- సన్నరకాలను పండించేలా రైతు కమిషన్ సిఫారసు**

**- కేబినేట్ సబ్ కమిటీలో చర్చించినట్లు భట్టి విక్రమార్క వెల్లడి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, జూన్ 17 : రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్యం తినాలని.. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయంలో భట్టివిక్రమార్క అధ్యక్షతన బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలపై ఈ సమీక్షలో చర్చించామని తెలిపారు.నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ సోనామసూరికి సంబంధించి వివిధ రకాలపై ఫోకస్ పెట్టామని వివరించారు.

11లో

## హర్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

**- భారత నావికుల రక్షణ మాకు ముఖ్యం**

**- హర్మూజ్‌పై ఆంక్షలు తొలగించడం ప్రపంచానికి అవసరం**

**- ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోదీ స్పష్టీకరణ**

**- మోడీ తనకు మంచి మిత్రుడు అంటూ మరోమారు ట్రంప్ వ్యాఖ్య**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)




ప్యారిస్, జూన్ 17 : హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనేందుకు కృషి చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఇరువురి నేతల మధ్య కీలక సంభాషణ జరిగింది. ట్రంప్‌తో ప్రధాని మోదీ ఇలా అన్నారు.. 'ప్రపంచానికి హార్ముజ్‌ను తెరవడం అత్యవసరం. సముద్రయాన స్వేచ్ఛను కచ్చితంగా కాపాడాలని.. దానిపై మనం ప్రత్యేక దృష్టి సారించాలని మేము ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. సముద్ర వాణిజ్య రంగంలో లక్షలాది మంది భారతీయ నావికులు ప్రపంచవ్యాప్తంగా

11లో

## 2వేల కోట్ల బడ్జెట్ లేకుండా

# అంత స్కామ్ సాధ్యమా

**- హరీష్ వ్యాఖ్యలపై పొన్నం ఆగ్రహం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, జూన్17 : తెలంగాణ గురుకుల పాఠశాలల టెండర్లలో రూ.2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. సంక్షేమ శాఖల్లో మొత్తం టెండర్ల విలువే రూ.2 వేల కోట్లు లేనప్పుడు, అంత మొత్తంలో స్కాం జరిగిందని ఎలా అంటారుని మంత్రి పొన్నం ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న శాఖలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా

11లో

## రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

**- 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన**

**- గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్17 : ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతా ధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశిం చారు. 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తా మని వెల్లడించారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని

11లో




# కుప్పకూలుతున్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ.. పెరుగుతున్న మంత్రుల ఆస్తులు

## - మంత్రి పొంగులేటిపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
## - పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 17 : రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రుల ఆదాయాలు, ఆస్తులు మాత్రం భారీగా పెరుగుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో బుధవారం నిర్వహించిన పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన, ముఖ్యంగా రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రెవెన్యూ ఆదాయం తగ్గిపోతున్నప్పటికీ రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతి సామ్రాజ్యం మాత్రం విస్తరిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో ఉందని చెబుతుంటే, ఆర్థిక శాఖను పర్యవేక్షిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదాయం, కమిషన్ దందాలు మాత్రం జోరుగా సాగుతున్నాయని విమర్శించారు. పొంగులేటి సంపాదించిన ఆస్తులు వేల కోట్లకు చేరాయని, నోట్లను లెక్కించే యంత్రాలు కూడా అలసిపోయే స్థాయిలో సంపాదించారని వ్యాఖ్యానించారు. రెండేళ్ల క్రితం జరిగిన ఈడీ దాడుల్లో వందల కోట్ల రూపాయలు బయటపడ్డాయని చెబుతూ, ఆ వ్యవహారంపై కాంగ్రెస్, బీజేపీలు ఎందుకు మౌనం పాటించాయని ప్రశ్నించారు. బీజేపీతో ఉన్న అవగాహన కారణంగానే పొంగులేటిపై ఈడీ కేసులు ముందుకు సాగలేదని ఆరోపించారు. రాష్ట్రంలో కోటి ఎకరాల భూములను వివాదాస్పద జాబితాలో చేర్చి వాటి పేరుతో సెటిల్‌మెంట్లు నిర్వహిస్తున్నారని, భూముల యజమానులను బెదిరించి లబ్ధి పొందుతున్నారని ఆరోపించారు. "రేవంత్ రెడ్డి దొంగ అయితే, పొంగులేటి గజదొంగ" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వట్టినాగులపల్లి ప్రాంతంలో భూముల వ్యవహారంలో మంత్రి కుమారుడు, అనుచరులు జోక్యం చేసుకుని దాడులకు పాల్పడ్డారంటూ ఆరోపణలు చేశారు. ఆ కేసుల్లో చర్యలు తీసుకున్న పోలీసు అధికారుల బదిలీలు జరిగాయని కూడా అన్నారు. పొంగులేటి అహంకార ధోరణిని ప్రజలంతా గమనిస్తున్నారని, బీసీ మంత్రులు కొండా సురేఖ, వాకిటి శ్రీహరిల పట్ల అనుచితంగా వ్యవహరించారని ఆరోపించారు. తోటి మంత్రులను గౌరవించకుండా, అధికారులను అవమానించే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. గృహనిర్మాణ శాఖ మంత్రిగా 20 లక్షల ఇళ్లు నిర్మించి ఓట్లు అడుగుతానని చెప్పిన పొంగులేటి, ఇప్పటివరకు ఎన్ని ఇళ్లు నిర్మించారో చెప్పాలని డిమాండ్ చేశారు. పాలనలో సగం కాలం పూర్తయిందని, కనీసం 10 లక్షల ఇళ్లు అయినా నిర్మించారా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఎన్ని ఇళ్లు కేటాయించారో వెల్లడించాలని కోరారు. ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేత ఘటనను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వానికి అభివృద్ధి కంటే విధ్వంసం ఎక్కువగా తెలుసని విమర్శించారు. "విధ్వంసం తప్ప వికాసం తెలియని దండుపాళ్యం ముఠా" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రైతుల విషయంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన భూమి శిస్తును తిరిగి అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి, పొంగులేటి ప్రయత్నిస్తున్నారని, భూమి శిస్తు పేరుతో రైతుల నుంచి డబ్బులు వసూలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. ములుగు జిల్లాలో ఇసుక దందా కోసం భారీ స్థాయిలో ప్రణాళికలు రచించారని, సమ్మక్క-సారలమ్మ జాతర టెండర్లను కూడా వదిలిపెట్టలేదని ఆరోపించారు. జాతర టెండర్ల విషయంలో మంత్రుల మధ్యే కమిషన్ల కోసం విభేదాలు నెలకొన్నాయని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గులాబీ జెండానే ఎగురుతుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు మద్దతు మరింత పెరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యా నాయక్, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, లింగాల కమల్‌రాజ్, ఏనుగుల రాకేశ్ రెడ్డి, బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.





# ముఖ్యమంత్రి తెలంగాణ పరువు తీస్తున్నాడు

## - తల్లి కాంగ్రెస్ తోనే పోరాటం చేసి తెలంగాణను సాధించుకున్నాం! ఇప్పుడున్న ఈ పిల్ల కాంగ్రెస్ ఎంత?
## - కార్మికులను కలిసేందుకు వస్తే గేట్లు బంద్ పెట్టి అడ్డుకుంటారా!
## - తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆగ్రహం - ఖనిలో కవిత 'బాయిబాట'

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూన్ 17 : కార్మికులను కలిసేందుకు వస్తే గేట్లు బంద్ పెట్టి అడ్డుకుంటారా! ప్రతిపక్ష పార్టీలను సింగరేణి కార్మికులు కలవద్దా? కార్మికులకు ఏ పార్టీ వారితోనైనా మాట్లాడే హక్కు ఉందనీ జీడీకే 11 ఇంక్లైన్ లో జరిగిన 'బాయిబాట' కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత గోదావరిఖని పర్యటనలో భాగంగా ముందుగా సింగరేణి ఆర్జీ-1 పరిధి జీడీకే 11 ఇంక్లైన్ గనిపై 'సింగరేణి బాయిబాట' కార్యక్రమం చేపట్టారు. టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ నాయకులతో కలిసి గనికి వెళ్లిన కవితను గని అధికారుల సూచనల మేరకు పోలీసులు, సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది గేట్ వేసి అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాగా నాయకులు గేట్ ను నెట్టుకుని లోపలకు వెళ్ళారు. ఈ మేరకు కవిత కార్మికులను కలుస్తూ వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. మహిళా కార్మికులతో కాసేపు ముచ్చటించి వారిని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ అసలు సింగరేణి క్యాంపస్ లోకి పోలీసులే రావద్దనీ, కానీ వాళ్లను తీసుకొచ్చారంటే వీళ్లు ఎంత తప్పు చేసి ఉంటారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క, రాహుల్ గాంధీ కూడా ఎన్నికలకు ముందు సింగరేణి కార్మికులతో మీటింగ్ లు పెట్టలేదా! అని ప్రశ్నించారు. కార్మికులు మీ మాటలు నమ్మి కోల్ బెల్ట్ ప్రాంతంలో కాంగ్రెస్ ను గెలిపించారని, కానీ మీరు గెలిచాక గ్లౌజ్ లు, షూస్, మెషీన్లలో ఏదీ నాణ్యత లేకుండా పోయిందన్నారు. గనుల్లోకి వెళ్లే కార్మికులకు కనీసం ఆక్సిజన్ కూడా ఇవ్వలేని పరిస్థితి తీసుకొచ్చారని ఆరోపించారు. ఏమైనా అడిగితే గత ప్రభుత్వం మీద నెట్టేసి డబ్బులు లేవంటూ చేతులెత్తుతున్నారని ఎద్దేవా చేశారు. సింగరేణి కార్మికులకు మాట ఇచ్చే ముందు ఇవ్వన్నీ మీకు తెలియదా! అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు కనీసం నీళ్లు, గాలి ఇచ్చే సోయి కూడా లేదనీ, ప్రాథమిక సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువ కావడంతోనే చిన్న చిన్న సౌకర్యాలు కూడా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. వీటన్నింటినీ ప్రశ్నించాల్సిన అవసరం ఉందనీ, తనది ప్రశ్నించే తత్వమని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అగ్గిరాజేసి రాష్ట్రం సాధించుకున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కూడా కేసీఆర్ తో మాట్లాడి మీ కోసం పనిచేశానని వెల్లడించారు. ముఖ్యంగా డిపెండెంట్ ఉద్యోగాల కోసం తాను చేసిన పోరాటంతో 19 వేల ఉద్యోగాలు నడుచుకుంటూ వచ్చాయని తెలిపారు. మహిళలకు సింగరేణిలో ఉద్యోగాలు వచ్చేలా చేశామని, తాను ఎప్పటికీ సింగరేణి బిడ్డనేనని, ఎక్కడున్నా కార్మికుల కోసమే కొట్లాడుతానని వెల్లడించారు. తల్లి కాంగ్రెస్ తోనే పోరాటం చేసి తెలంగాణను సాధించుకున్నాం! ఇప్పుడున్న ఈ పిల్ల కాంగ్రెస్ ఎంత? అంటూ పంచ్ డైలాగ్ విసిరారు. ఈ ముఖ్యమంత్రి తెలంగాణ ఇజ్జత్ తీయటమే పనిగా పెట్టుకున్నాడనీ, ఢిల్లీకి అప్పు కోసం పోతే చెప్పులు ఎత్తుకుపోయే వాళ్లను చూసినట్లు చూస్తున్నారని అంటాడని, మహారాష్ట్ర ముఖ్యమంత్రి తన ఫోన్ ఎత్తటం లేదని చెబుతాడనీ, మొన్నటికి మొన్న నేను హిట్లర్ లాంటి వాడినంటూ గొప్పగా చెప్పుకున్నాడనీ, అసలు ఒక ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఇంత బేలగా మాట్లాడుతాడా! అని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ సింగరేణికి కొత్త బ్లాక్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూసివేతకు గురైన అండర్ గ్రౌండ్ గనులను ప్రభుత్వం తెరవాలని, బొగ్గు బ్లాక్ లలో షాఫ్ట్ వేస్తే అవి ఇంకొక 50 ఏళ్ల వరకు నడుస్తాయన్నారు. అండర్ గ్రౌండ్ మైనింగ్ కారణంగా పర్యావరణ పరిరక్షణతో పాటు వేలాది మందికి ఉపాధి దొరుకుతుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల కష్టాలపై మాట్లాడాల్సిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ మౌనంగా ఉందనీ, సింగరేణి డబ్బులతో నిర్మించిన మెడికల్ కాలేజ్ లో 25 శాతం సీట్లు కార్మికుల పిల్లలకు ఇవ్వాలి కానీ, ఐదు శాతం కూడా ఇవ్వటం లేదని ఆరోపించారు. దీనిపై ఏఐటీయూసీ నేతల స్పందన లేదన్నారు. అనంతరం గంగానగర్ సమీపంలోని రాపిడ్ ఫిల్టర్ బెడ్ ను సందర్శించారు. సింగరేణి కాలనీల్లో ప్రజలకు మంచి నీళ్లు ఇచ్చే బాధ్యత సింగరేణి యాజమాన్యానిదేనని, కానీ మొత్తం డ్రైనేజీ నీళ్లు మంచి నీళ్లలో కలుస్తున్నా కనీసం ఫిల్టర్ చేయటం లేదన్నారు. దీంతో ప్రజలు నీళ్లు కొనుక్కోని తాగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇక్కడి ఫిల్టర్ బెడ్ కోసం 20 కోట్లు ఖర్చు చేశారనీ, కానీ పనులు పూర్తి చేయకపోవటంతో ఇప్పటికీ ప్రజలకు నీళ్లు రావటం లేదన్నారు. వెంటనే రాపిడ్ ఫిల్టర్ సిస్టమ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఫిల్టర్ బెడ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే సింగరేణి కాలనీలతో పాటు 30 వేల మంది ప్రజలకు నీళ్లు ఇవ్వొచ్చునీ అన్నారు. తదనంతరం కవిత గోదావరిఖనిలోని సింగరేణి ఏరియా హాస్పిటల్ ను సందర్శించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బందితో మాట్లాడి వారికి ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. మనకు ఉన్న సింగరేణి హాస్పిటల్ లో నిజానికి గాంధీ, ఉస్మానియాలో ఉన్నన్ని సౌకర్యాలు ఉండాలనీ, ఇక్కడ హాస్పిటల్స్ లో చాలా కష్టాలున్నాయన్నారు. కాంట్రాక్ట్ స్టాఫ్ ను తీసుకొని వాళ్లను ఇబ్బంది పెడుతున్నారని, అసలు తెలంగాణలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానం ఉండొద్దన్నది తమ విధానమన్నారు. హాస్పిటల్ బయట క్యాంటీన్ లో చాయ్ తాగి సింగరేణి ఏరియా హాస్పిటల్ నుండి గోదావరిఖని చౌరస్తాలోని హెచ్ఎంఎస్ కార్యాలయం వరకు ఆటోలో ప్రయాణిస్తూ ఆటో కార్మికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాలలో ఆమె వెంట టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ నాయకులున్నారు.





# ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రులు పొన్నం, అడ్లూరి

## - విద్యార్థులు, ప్రయాణికులతో మాటా ముచ్చట

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూన్ 17 : రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల నుంచి కరీంనగర్ ఎన్టీఆర్ విగ్రహం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు. స్కూళ్లు, కళాశాలల సమయాలకు అనుగుణంగా అదనపు బస్సులు నడుపుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు కొనుగోలు చేసి, కొత్త రూట్లలో సేవలు ప్రారంభించామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే కాకుండా ఆర్టీసీని బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆర్టీసీ సిబ్బందికి సూచించిన మంత్రి, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గుర్తింపు సంఘాల ఎన్నికలు పూర్తయ్యాక వాటిని అధికారిక కమిటీలో విలీనం చేసే ప్రక్రియ చేపడతామని తెలిపారు. గురుకుల పాఠశాలల్లో మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచామని, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రీ-ప్రైమరీ తరగతులు, ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్, మిల్క్ వర్ధ కాలను ప్రారంభించినట్లు వివరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 2023 డిసెంబర్‌లో ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని గుర్తుచేశారు. గతంలో అపరిష్కృతంగా ఉన్న అనేక ఆర్టీసీ సమస్యలను పరిష్కరించామని, ప్రస్తుతం తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి ప్రజా రవాణా సంస్థగా నిలుస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 వేలకుపైగా బస్సులు నడుస్తున్నాయని, మహిళలు నెలకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. జూన్ 21న జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు హాల్‌టికెట్ ఆధారంగా ఉచిత ప్రయాణం కల్పించాలన్న ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ స్వామి విజ్ఞప్తిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ప్రజాపాలన ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.





# విద్యాసంస్థల వాహన డ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలి

## గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూన్ 17 : పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సుల డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ అన్నారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు,రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని సబ్‌డివిజన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు మరియు బస్సు డ్రైవర్లకు అవగాహన సదస్సును సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఎన్‌టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు,ఆదేశాలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు నైపుణ్యం కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించుకోవాలని సూచించారు.విద్యార్థులను ఎక్కించే సమయంలో,దించే సమయంలో నిర్దేశించిన ప్రదేశాల్లోనే బస్సులను నిలిపివేయాలని తెలిపారు.డ్రైవర్లు అతివేగంగా వాహనాలు నడపకూడదని, ఓవర్‌టేకింగ్ చేయరాదని సూచించారు.మద్యం సేవించి వాహనం నడపడం లేదా సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డ్రైవర్లు చేసే ఏ తప్పిదానికైనా సంబంధిత పాఠశాల లేదా కళాశాల యాజమాన్యాలదే బాధ్యత అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రామగుండం సీఐ కృష్ణకుమార్,మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ రెడ్డి, ఎన్‌టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్, రామగుండం ఎస్ఐ సంధ్యారాణి,రామగిరి ఎస్ఐ శ్రీనివాస్, ముత్తారం ఎస్ఐ రవికుమార్, పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు,బస్సు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.




# ఖరీఫ్‌కు ముందస్తు ప్రణాళికతో సన్నద్ధం కావాలి

## కలెక్టర్ చిత్రా మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూన్ 17 : జిల్లాలో ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, ఉద్యానవన శాఖల సన్నద్ధతపై బుధవారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సమీక్ష నిర్వహించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచేలా అధికారులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఆదేశించారు. తక్కువ వర్షపాతం అవకాశాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు, తృణధాన్యాలు, నూనెగింజలు, పత్తి సాగును ప్రోత్సహించాలని సూచించారు. మొక్కజొన్న ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, నాణ్యమైన విత్తనాల సరఫరా, వాతావరణ అంచనాల సమాచారాన్ని రైతులకు అందించాలని పేర్కొన్నారు. యాప్ ద్వారా ఎరువుల బుకింగ్‌పై అవగాహన కల్పించడంతో పాటు యూరియా కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యానవన శాఖ పథకాలపై వాల్ పోస్టర్ల ద్వారా ప్రచారం నిర్వహించాలని, పండ్ల, పూల తోటలు, ఆయిల్ పామ్ సాగులో విజయవంతమైన రైతుల అనుభవాలను గ్రామాల్లో ప్రచారం చేయాలని తెలిపారు. చేప పిల్లల విడుదల, పశుసంపద అభివృద్ధి, పశు వైద్య ఆసుపత్రుల్లో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, మత్స్య శాఖ అధికారి విజయభారతి, పశుసంవర్ధక శాఖ అధికారి లింగారెడ్డి, ఆత్మ పీడీ చత్రు నాయక్, మార్క్‌ఫెడ్ డీఎం గౌరీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో యూరియా నిల్వలు పుష్కలం

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, జూన్ 17: వానాకాలం-2026 సీజన్‌కు సంబంధించి పెద్దపల్లి జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో 18,750 మెట్రిక్ టన్నుల యూరియా (4,12,511 బస్తాలు) అందుబాటులో ఉండి, రైతులకు ఎలాంటి కొరత లేకుండా సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.ప్రతివారం రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీ ఎల్) తో పాటు ఇతర కంపెనీల నుంచి యూరియా నిల్వలు జిల్లాకు చేరుతున్నాయని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యమవడంతో పంటల సాగు ప్రారంభం కాకపోవడం వల్ల యూరియా బుకింగ్ యాప్‌ను తాత్కాలికంగా నిలిపివేశామని, మరో రెండు నుంచి మూడు రోజుల్లో యాప్‌ను తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు యూరియా లభ్యతపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.



# అక్రమ చేపల చెరువుల కుల్చివేత 80 ఎకరాలు స్వాధీనం

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జూన్ 17 : అంతర్గాం మండలం ఎల్లంపల్లి శ్రీపాద ప్రాజెక్టు పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ చేపచెరువులను తమ అధికారులు కూల్చి వేశారని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రకటించారు ఈ కూచివేతల ద్వారా జిల్లా వ్యాప్తంగా మొత్తం 22 అక్రమ చెరువుల ను తొలగించడం జరిగిందని ఇందులో భాగంగా మొర్మార్ గ్రామంలో 17 సోమనపల్లి గ్రామంలో 2 పొట్యాల గ్రామంలో రెండు ఎల్లంపల్లి గ్రామంలో ఒకటి తొలగించారని కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రకటనలో పేర్కొన్నారు ఈ చర్య ద్వారా గత సంవత్సరాలుగా అక్రమన గురైన సుమారు 80 ఎకరాల ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు కూల్చివేత ప్రక్రియలో నీటిపారుదల రెవిన్యూ పోలీస్ పంచాయతీరాజ్ మత్స్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారని పేర్కొన్నారు ప్రభుత్వ భూములను అనుమతి లేకుండా ఆక్రమిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ కోయశ్రీ హర్ష హెచ్చరించారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, జూన్ 17 : పాపన్నపేట మండల పరిధిలోని చిత్రియాల్ గ్రామానికి చెందిన మంగలి మహిపాల్ మరణించగా, ఈ విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతి రెడ్డి బుధవారం రోజు వారి కుటుంబానికి రూ.5000 లు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైరి సురేష్,మాజీ సర్పంచ్ సులోచన,మాజీ ఉప సర్పంచ్ శేకయ్య సునీత,వార్డ్ మెంబర్ సూర్య మంగళ, సత్యం, కిషన్ తదితర కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

## - మెగా జాబ్ మేళాలు యువత జీవితాలకు కొత్త ఆశలకు నాంది - రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 17 : జిల్లాలోని యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని, మెగా జాబ్ మేళాలు నిరుద్యోగ యువత జీవితాల్లో కొత్త ఆశలకు నాంది పలుకుతున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి,గ్రామీణ నీటి సరఫరా,మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా ఇంచర్లలోని ఎం.ఆర్.ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళా--2026 కార్యక్రమానికి మంత్రి దనసరి అనసూయ సీతక్క,జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యంగా మెగా జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. ఉద్యోగం చేయాలనే సంకల్పంతో యువత నిరంతరం కృషి చేయాలని,వచ్చిన అవకాశాలను వదులుకొని సమయాన్ని వృథా చేస్తూ మత్తు పదార్థాల ఊబిలో చిక్కుకోకుండా గౌరవప్రదమైన జీవనాన్ని నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు.వేధో సంపత్తి పెంపొందించుకునేందుకు నిరంతరం శ్రమించాలని, జీవితంలో ఉన్నత ఆశయాలను సాధించిన వారిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.ఉద్యోగం రాని వారు నిరుత్సాహపడవద్దని, వారికి మళ్లీ అవకాశాలు కల్పించేందుకు జాబ్ మేళా కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు.యువత ఇంటి వద్ద తల్లిదండ్రులకు వెన్నుదన్నుగా నిలుస్తూ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధం కావాలని,త్వరలో రాబోయే పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ కోసం జిల్లా యువతీ యువకులకు ఉచిత శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, మెగా జాబ్ మేళాకు సుమారు రెండు వేల మందికి పైగా నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారని తెలిపారు. జాబ్ మేళాలో ఉద్యోగం సాధించిన వారు శిక్షణ కాలాన్ని సమర్థవంతంగా పూర్తి చేసి అద్భుతమైన భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ప్రాంతీయ తారతమ్యం లేకుండా ఉద్యోగం వచ్చిన ప్రాంతానికి వెళ్లి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కోరారు. భవిష్యత్తులో నిరుద్యోగ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడమే జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ మాట్లాడుతూ, యువత తమ జీవిత లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని అన్నారు.సమాజాన్ని నాశనం చేసే మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉంటూ విద్య, ఉపాధి,వ్యక్తిత్వ వికాసం వైపు దృష్టి సారించాలని సూచించారు. ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుని బాధ్యతాయుత పౌరులుగా సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు.ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో మాట్లాడుతూ,ఏజెన్సీ ప్రాంతంలో మెగా జాబ్ మేళా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఐటీడీఏ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు,ఏఎస్పీ మనన్ భట్,పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఇంచర్ల సర్పంచ్ కుమార్ గౌడ్, మున్సిపాలిటీ వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్ రియాజ్ మీర్జా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు ముందుకు రావడం అభినందనీయం : జిల్లా కలెక్టర్ హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఆసిఫాబాద్, జూన్ 17 : ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి గ్రామస్థులు, దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడం ఎంతో అభినందనీయమని జిల్లా కలెక్టర్ కే హరిత అన్నారు .బుధవారం కేరమేరి మండలం గోయగం గ్రామంలోప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని, వాటి మౌలిక వసతుల కల్పనకు నాణ్యమైన విద్యా ప్రమాణాల పెంపుదలకు తమ వంతు సహకారాన్ని అందించాలని ఆమె పిలుపునిచ్చారు. గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులతో కలిసి పాఠశాలలో నిర్వహిస్తున్న 'సామూహిక అక్షరాభ్యాసం' కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామంలోని అదనపు తరగతి గదుల నిర్మాణానికి పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు, దాతలు చూపిస్తున్న చొరవను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాయంపేట పాఠశాలను ఒక ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దడంలో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసికట్టుగా ముందుకు రావడం ఆదర్శనీయమన్నారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను ఇదే రీతిలో అభివృద్ధి పథంలో నడిపించాలని విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాలల్లో మంచినీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, మండల విద్యాశాఖ అధికారిఉపేందర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రాధాన్యతా రంగాల రుణాల లక్ష్య సాధనకు బ్యాంకులు కృషి చేయాలి

## అదనపు కలెక్టర్ పాండు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



సంగారెడ్డి, జూన్ 17 : జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించి లక్ష్య సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ పాండు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో మార్చి-2026 త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (ణజజ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (ఖా=జ) సమావేశం నిర్వహించారు. సమావేశానికి అదనపు కలెక్టర్ పాండు అధ్యక్షత వహించగా, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ టి. సుధీర్ కుమార్ సమావేశాన్ని సమన్వయం చేశారు. ఈ సమావేశానికి ఆర్బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ వెన్న, నాబార్డ్ ఏజీఎం/డీడీఎం కృష్ణతేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని బ్యాంకుల కంట్రోలర్లు, ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో జిల్లా బ్యాంకింగ్ కార్యకలాపాలపై జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సుధీర్ కుమార్ సమగ్ర నివేదికను సమర్పించారు. జిల్లాలో పంట రుణాల లక్ష్యం రూ.3,499.21 కోట్లకు గాను 90.66 శాతం, మొత్తం వ్యవసాయ రుణాల లక్ష్యం రూ.6,816.57 కోట్లకు గాను 87.16 శాతం, మొత్తం అడ్వాన్సుల లక్ష్యం రూ.23,438.93 కోట్లకు గాను 92.81 శాతం సాధించినట్లు వివరించారు. అదే విధంగా విద్యా రుణాలు, గృహ రుణాలు, సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల రుణాలు, స్వయం సహాయక సంఘాల రుణాలు, తదితర రంగాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ, ప్రాధాన్యతా రంగాల అభివృద్ధికి బ్యాంకులు మరింత చురుకుగా వ్యవహరించి అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు అందించడంతో పాటు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఆర్బీఐ ఏజీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ, బ్యాంకులకు కేటాయించిన గ్రామాల్లో ప్రధానమంత్రి జనసురక్ష పథకాలైన ప్రధాన్ మంత్రి జనధన్ యోజన, ప్రధాన్ మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన్ మంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన పథకాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మరింత మంది లబ్ధిదారులను చేర్చాలని సూచించారు.అలాగే రీ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం, ఖాతాలను నిరంతరం సక్రియంగా నిర్వహించుకోవడం గురించి ఖాతాదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. నాబార్డ్ ఏజీఎం కృష్ణతేజ మాట్లాడుతూ, వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి, కిసాన్ క్రెడిట్ కార్డు, పశుసంవర్ధక, మత్స్యరంగ రుణాల కింద అర్హులైన రైతులు, లబ్ధిదారులకు మరింతగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు, డీఆర్‌డీఏ, డీఐసీ తదితర విభాగాల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఇల్లందు-కొత్తగూడెం రైల్వే అండర్ బ్రిడ్జి 45 రోజులు మూసివేత

## - ప్రత్యామ్నాయ మార్గాల్లో వాహనాల మళ్లింపు - వాహనదారులు సహకరించాలని పోలీసుల విజ్ఞప్తి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 17 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి ప్రధాన రహదారిపై ఉన్న ఇల్లందు-కొత్తగూడెం రైల్వే అండర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతుల పనుల కోసం గురువారం నుంచి 45 రోజుల పాటు రాకపోకలను నిలిపివేస్తున్నట్లు రైల్వే, ఆర్అండ్‌బీ అధికారులు ప్రకటించారు. జిల్లా ఎస్పీ బి.రోహిత్ రాజ్ ఆదేశాలు, కొత్తగూడెం డీఎస్పీ ఎల్. ఆదినారాయణ సూచనల మేరకు ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. మరమ్మతుల పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సూచించారు. ఇల్లందు నుంచి కొత్తగూడెం వచ్చే వాహనాలు కారుకొండ-రామవరం-సుజాతనగర్ మార్గం మీదుగా కొత్తగూడెం చేరుకోవాలని, మణుగూరు, భద్రాచలం నుంచి ఇల్లందు వెళ్లే వాహనాలు కొత్తగూడెం-కారుకొండ-రామవరం మార్గం ద్వారా ఇల్లందు వైపు ప్రయాణించాలని, పాల్వంచ నుంచి విజయవాడ వైపు వెళ్లే భారీ వాహనాలు పాత కొత్తగూడెం మార్గాన్ని వినియోగించాలని అధికారులు సూచించారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు, లారీలు సహా అన్ని వాహనాలు నిర్దేశించిన ప్రత్యామ్నాయ మార్గాల్లోనే ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. అత్యవసర సేవల వాహనాలకు మాత్రమే ప్రత్యేక అనుమతి ఉంటుందని తెలిపారు. ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే తమ ప్రయాణ ప్రణాళికలను రూపొందించుకోవాలని, పోలీసు శాఖకు సహకరించాలని కొత్తగూడెం డీఎస్పీ ఎల్. ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు. మరమ్మతుల పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని అధికారులు వెల్లడించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

## - ఎస్.ఐ.ఆర్. సదస్సులో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూన్ 17 : ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని పాల్వంచ సొసైటీ అధ్యక్షుడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్‌ఏలు) కోసం నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రత్యేక సమగ్ర సర్వే సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పాత ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో పాల్వంచ తహసీల్దార్ దారా ప్రసాద్ అధ్యక్షతన ఈ సదస్సు నిర్వహించబడింది. కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, 2002లో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఆధారంగా ప్రస్తుతం ఓటర్ల జాబితా మ్యాపింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా అనర్హుల పేర్లను తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటారని చెప్పారు. బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ లెవల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటి సర్వే నిర్వహించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అర్హులైన ప్రతి పౌరుడి పేరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వివిధ రాజకీయ పార్టీల బీఎల్‌ఏలు, బీఎల్‌ఓలు, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న గౌడ్, గంగిరెడ్డి భువన సురేందర్ రెడ్డి, వై. వెంకటేశ్వరరావు, బూసి శ్రీను, గంధం నరసింహారావు, ఆదెపు వెంకటరామయ్య, అజ్మీర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలలు మరింత బలోపేతం కావాలి

## - జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, జూన్ 17 : ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీలు మరింత బలోపేతం కావాలని,అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం మెదక్ జిల్లా,నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని,ప్రాథమిక పాఠశాలలను డిఆర్డిఓ, డీఈవో,డిడబ్ల్యూఓ,గ్రామ సర్పంచ్ తో కలిసి సందర్శించారు. జిల్లా కలెక్టర్ అంగన్వాడి కేంద్రంలోనీ చిన్నారులతో ముచ్చటించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలలు మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటు న్నట్లు అంగన్వాడిలలో, ప్రీస్కూల్స్ లో,ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు,త్రాగునీరు, టాయిలెట్స్, విద్యుత్‌లతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. అంగన్వాడీలలో,ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని,తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా,ప్రభుత్వ పాఠశాల లను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలన్నారు. అంగన్వాడి టీచర్లు,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యార్థుల వయస్సును బట్టి అంగన్వాడి, ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయించాలని అధికారులు ఆదేశించారు. అంతకుముందు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖధికారి రాజు, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి,ఏఎంఓ సుదర్శన్ మూర్తి,ఎంఈఓ తారాసింగ్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## - ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను కలిసిన తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం నేతలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 17 : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్ మాదిగ కోరారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యాలయంలో అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని కలిసి జర్నలిస్టుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు మంజూరు చేయడంతో పాటు ఇంటి స్థలాలు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టులపై బెదిరింపులు, దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టేలా కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించే విషయంలో సానుకూలంగా ఉన్నా రని, త్వరలోనే శుభవార్త అందే అవకాశం ఉందని తెలిపారు. అంతకుముందు అమరులైన జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంలో భాగంగా తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి రాజేందర్ సతీమణి రమాదేవికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి సుక్క అశోక్ మాదిగ, కొండగడుగుల ఎల్లయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ బడుల్లోనే మంచి విద్య అందుతుంది

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 17 : నాణ్యమైన విద్య అందుతుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు. బుధవారం కుంటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బడికి హాజరుకాని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేలా చూడాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉం చాలని సూచిస్తూ, అపరిశుభ్రతపై అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్, చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కూడా అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు లెక్కలు చేయించి, పలు ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. పాఠ్యాంశాలతో పాటు విద్యార్థుల నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రాంగణంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఆదేశించారు. అనంతరం కుంటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్య సేవలు, రికార్డులను పరిశీలించారు. కాలానుగుణ వ్యాధుల నేపథ్యంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అందకూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించి, చిన్నారులతో ముచ్చటించారు. విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, మండల విద్యాధికారి ముత్యం, సర్పంచ్ గజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ త్రిశక్తి మహా గాయత్రి మందిరంలో మహా పూర్ణాహుతి

## - పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దంపతులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, జూన్ 17 : భువనగిరి పట్టణంలోని శ్రీ త్రిశక్తి మహా గాయత్రి మందిరంలో గత 33 రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ త్రిశక్తి మహా గాయత్రి జ్ఞాన యజ్ఞం మహా పూర్ణాహుతి కార్యక్రమంతో ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిర వ్యవస్థాపకులు దివ్యజ్ఞాన గురూజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహా పూర్ణాహుతి కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యజ్ఞాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా వరంగల్ హైవే బైపాస్ రోడ్డు నుంచి మందిరం వరకు నిర్మించిన సీసీ రహదారిని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. సమాజ శ్రేయస్సు, లోక కళ్యాణం కోసం నిర్వహించిన ఈ యజ్ఞం ద్వారా భువనగిరి నియోజకవర్గ ప్రజలం దరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ అమ్మవారి ఆశీస్సులను ఎమ్మెల్యే దంపతులు స్వీకరించారు. అనంతరం వారు యజ్ఞంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి-రవికుమార్ దంపతులు, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల-వెంకటేశ్వర్లు దంపతులు, తోటకూర వెంకటేష్ యాదవ్, స్థానిక కోర్టు డీపీ చందుపట్ల రజిని-విశ్వేశ్వర్‌రావు దంపతులు, శ్రీ గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు చందుపట్ల వెంకటేశ్వరరావు, అధ్యక్షులు డాక్టర్ కె. రాధాకృష్ణమూర్తి, గౌరవ సభ్యులు కనకాల శ్యాంసుందర్రావు, విజయలక్ష్మి, భాస్కరరావు, రామేశ్వరరావు, బి.ఎస్. రమేష్, కనకాచారి తదితరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం
సంపాదకీయం

# విద్యార్థులకు నీట్ కటకటలు !

నీట్ ఏ ముహూర్తాన ప్రవేశ పెట్టారో కానీ ఎప్పుడూ సవ్యంగా సాగడం లేదు. ఈ నెల 21 తిరిగి నీట్ నిర్వహించబోతున్నారు. ఈ క్రమంలో పరీక్షాపత్రం సిద్ధం చేసిన వారిని రహస్య ప్రాంతంలో విడిది చేయించారు. వారికి ఫోన్, టివి లాంటివి అందుబాటులో లేకుండా రహస్యంగానే ఉంచారు. గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకున్నప్పుడు ఎక్కడా లోపాలు లేవు. సాఫీగా ఎంసెట్ జరిగింది. మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు సాఫీగా సాగాయి. కానీ ఎప్పుడైతే జాతీయ స్థాయిలో నీట్ ప్రవేశ పెట్టాక గందరగోళం, పేపర్ లీక్‌లు సర్వసాధరణంగా మారింది. తాజాగా మరోమారు పేపర్ లీక్ కావడంతో ఈ నెల 21వ తేదీన తిరిగి పరీక్షను నిర్వహించబోతున్నారు. ఇప్పుడు ప్రధాని కార్యాలయం స్వయంగా పర్యవేక్షించడం చూస్తున్నాం. హెలికాప్టర్లు, విమానాలు, సిఆర్‌పిఎఫ్ బలగాల రక్షణలో పరీక్ష నిర్వహించ బోతున్నారు. నిజానికి పరీక్షకు ప్రిపేర్ అయి గతంలోనే రాసిన అనేకమంది ఇప్పుడు తమ భవిష్యత్ ఎలా ఉంటుందో అన్న గందరగోళంలో పడ్డారు. మానసికంగా వారు ఒత్తడికి గురవుతున్నారు. యూపిపిఎస్సీ పరీక్షను సక్రమంగా నిర్వహిస్తున్నపుడు నీట్ పరీక్షను ఎన్‌టిఎ ఎందుకు సరిగా నిర్వహించడం లేదని సుప్రీం కోర్టు గతంలోనే మొట్టి కాయలు వేసింది. నీట్ పరీక్షను పక్కాగా నిర్వహించడంలో విఫలం అయిన ఎన్‌టిఎపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్న తీరు సమస్యగా మారింది. ఇకపోతే 21న పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు నీట్-యూజీ పరీక్ష అడ్మిట్‌కార్డుల డౌన్‌లోడింగ్ పక్రియలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అడ్మిట్‌కార్డులు నీట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆ పరీక్షను నిర్వహించే 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) ఆదివారం ప్రకటించగానే.. విద్యార్థులు భారీ సంఖ్యలో వెబ్‌సైట్‌ను సందర్శించారు. అయితే, పోర్టల్ తెరుచుకోవటానికి చాలా సమయం పడుతోందని, మధ్యలోనే నిలిచిపోతోందని, టైమ్‌ఔట్ ఎర్రర్స్‌ని చూపిస్తోందని అనేక మంది సోషల్ మీడియాలో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ, పరీక్షకు మళ్లీ సన్నద్ధం కావటంలో ఇప్పటికే తాము తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉంటే.. ఈ సమస్యలు ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. అడ్మిట్‌కార్డుల విషయంలో ఈ పరిస్థితి ఉంటే.. ఫీజు రిఫండ్ అంశంలోనూ సమస్యలు తలెత్తాయని తెలిపారు. రిఫండ్ కోసం తమ బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించిన తర్వాత కూడా.. వివరాలు ఇవ్వలేదంటూ వెబ్‌సైట్‌లో కనిపించిందని పలువురు వెల్లడించారు. మరికొందరు, తమకు తెలియకుండా.. రిఫండ్ అవసరం లేదనే ఆప్షన్‌ను సెలక్ట్ చేశామని, రిఫండ్ కోసం ఈ ఆప్షన్‌ను ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించాలని ఎన్‌టీఏకు విజ్ఞప్తులు చేశారు. అడ్మిట్‌కార్డుల కోసం ప్రత్యామ్నాయ విధానాలను కూడా అందుబాటులో ఉంచాలని, బ్యాంకుఖాతాల ధ్రువీకరణ పక్రియను సులభతరం చేయాలని పలువురు ఎన్‌టీఏకు సూచించారు. కాగా, ఈ ఫిర్యాదులపై ఎన్‌టీఏ సోమవారం స్పందిస్తూ.. విద్యార్థులు భారీ సంఖ్యలో సందర్శించటం వల్ల తమ సర్వర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటిని సరిదిద్దటానికి నిపుణులు పని చేస్తున్నారని పేర్కొంది. ఇప్పటికే 4 లక్షల మంది విద్యార్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిపింది. పేపర్ లీకేజీ, తిరిగి పరీక్ష నిర్వహణ నేపథ్యంలో నీట్ విద్యార్థులకు ఫీజును రిఫండ్ చేస్తామని ఎన్‌టీఏ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా.. ఓ సైబర్ నేరస్థుడు రిఫండ్‌ల మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించుకు న్నాడు. బిహార్‌లోని గయ జిల్లాకు చెందిన 19 ఏళ్ల నవీన్ యాదవ్ అనే వ్యక్తి నీట్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 150 మంది విద్యార్థుల అకౌంట్లను హ్యాక్ చేశాడు. రిఫండ్ కోసం ఆయా విద్యార్థులు ఇచ్చిన బ్యాంకు ఖాతాల వివరాల స్థానంలో తన బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేశాడు. తద్వారా ఒక్కో విద్యార్థికి రూ.1700 చొప్పున వచ్చిన రిఫండ్ మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించాడు. దీనిపై ఓ విద్యార్థి తండ్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ సైబర్ క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేయగా.. అసలు విషయం బయటపడింది. నవీన్ యాదవ్ ను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు, నీట్ రీఎగ్జామ్ ప్రశ్నపత్రాలను అమ్ముతామంటూ విద్యార్థులు, తల్లిదండ్రు లతో బేరసారాలు సాగిస్తున్న రాజస్థాన్‌కు చెందిన సుమేర్ సింగ్ మీనా, ఆకాశ్‌మీనా అనే ఇద్దరు వ్యక్తులను పోలీ సులు అరెస్టు చేశారు. టెలిగ్రాం ఛానళ్ల ద్వారా వీరు నీట్ ప్రశ్నపత్రాల గురించి ప్రచారం చేశారని, రూ.1.5 కోట్ల మేర లావాదేవీలు జరిపారని వెల్లడైంది. ఇదిలావుంటే ఈ గందరగోళం నేపథ్యంలో ఒక పరీక్ష నిర్వాణకు ఇంతగా హంగామా ఎందుకని తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు, విశ్రాంత పోలీస్ అధికారి అన్నామలై ప్రశ్నించారు. పోలీసులు, హెలికాప్టర్ల వినియోగం వంటివన్నీ చేయడం, ప్రధాని కార్యాలయం సమీక్షించడం వంటివి వైఫల్యాలను ఎత్తి చూపుతున్నాయని అన్నారు. నీట్ పరీక్ష విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాలపై సమీక్షించాలి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనుసరిస్తున్న తీరుగా పటిష్టం చేయాలి. లేదా నీట్‌ను ఎత్తివేయడం మంచిది..

## ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్ఐఆర్)

# నిష్పాక్షిక సంస్కరణా? వివాదాల సుడి గుండమా?

## ఓటరు జాబితా ప్రక్షాళన: ప్రజాస్వామ్య శుద్ధికా? రాజకీయ లబ్ధికా?



రామకిష్టయ్య సంగన భట్ల
9440595494

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు సంపూర్ణమైన, నిష్పాక్షికమైన ఎన్నికల ప్రక్రియే ప్రాణాధారం. ఓటరు జాబితా ఎంత ఖచ్చితంగా, పారదర్శకంగా ఉంటే ప్రజాస్వామ్య పునాదులు అంతగా బలపడతాయి. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన 'ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం' (ఎస్ఐఆర్-స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తీవ్ర రాజకీయ చర్చకు, మేధోమథనానికి దారితీసింది. అధికారికంగా ఇది ఓటరు జాబితాల్లోని దీర్ఘకాలిక లోపాలను సరిచేయడం, నకిలీ, అర్హతలేని ఓటర్లను తొలగించడం, అర్హులైన ప్రతి పౌరుడిని జాబితాలో చేర్చడం కోసం తలపెట్టిన బృహత్తర సంస్కరణగా ఎన్నికల సంఘం పేర్కొంటోంది. అయితే, ప్రతిపక్షాలు మాత్రం దీనిని ఎన్నికల ముంగిట అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా, ఒక వ్యూహం ప్రకారం ప్రతిపక్ష సానుభూతిపరుల ఓట్లను గైర్హాజరు చేసేందుకు ఉద్దేశించిన రాజకీయ ప్రేరిత చర్యగా తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఈ భిన్న దృక్పథాల నేపథ్యంలో ఎస్ఐఆర్ సాధ్యాసాధ్యాలను, దాని పూర్వాపరాలను, చారిత్రక పరిణామాలను సమగ్రంగా విశ్లేషించాల్సిన అవసరముంది.

భారత రాజ్యాంగంలోని 324వ అధికరణ ప్రకారం దేశంలో స్వేచ్ఛాయుత, పారదర్శక ఎన్నికల నిర్వహణ బాధ్యత స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘానికి అప్పగించబడింది. ఓటరు జాబితాలను నిరంతరం నవీకరించడం, వాటి స్వచ్ఛతను కాపాడడం ఈ రాజ్యాంగ బద్ధ సంస్థ ప్రాథమిక విధి. సాధారణంగా ప్రతి సంవత్సరం దేశంలో సంక్షిప్త సవరణ జరుగుతుంది. ఇందులో కేవలం కొత్తగా 18 ఏళ్లు నిండిన వారిని చేర్చడం, మరణించిన వారి వివరాలను తొలగించడం వంటి పరిమిత ప్రక్రియలు ఉంటాయి. కానీ, దేశంలో మారుతున్న జనాభా రేటు, ఉపాధి కోసం సాగుతున్న అంతర్గత వలసలు, పట్టణీకరణ, సాంకేతిక మార్పుల వల్ల క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల్లో భారీ వ్యత్యాసాలు చోటుచేసు కుంటున్నాయి. ఒకే వ్యక్తి పేరు బహుళ నియోజకవర్గాల్లో లేదా ఒకే నియోజకవర్గంలో వివిధ బూత్‌లలో నమో దవడం వంటి 'ద్వంద్వ ఓట్ల' సమస్య ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తోం ది. ఈ క్రమరాహిత్యాలను శాశ్వతంగా నివారించేందుకు, సాధారణ సంక్షిప్త సవరణల కంటే భిన్నంగా, క్షేత్రస్థాయిలో లోతైన పరిశీలనతో కూడిన ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల సంఘం తెరపైకి తెచ్చింది. ప్రస్తుతం భారతదేశంలో నమోదిత ఓటర్ల సంఖ్య సుమారు 100 కోట్లకు పైగా ఉండి, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటరు గణాంక వ్యవస్థగా నిలిచింది. ప్రతి సార్వత్రిక ఎన్నికల చక్రంలో లక్షలాది మంది కొత్త ఓటర్లు ఈ జాబితాలోకి ప్రవేశిస్తుండగా, మరణాలు, శాశ్వత వలసల కారణంగా వేలాది మంది పేర్లను తొల గించాల్సి వస్తోంది. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం, గత దశాబ్ద కాలంలో దేశవ్యాప్తం గా దాదాపు 2 నుండి 3 శాతం ఓట్లు సాంకేతిక లోపాలు, తప్పుడు చిరునామాలు లేదా నకిలీ గుర్తింపు కార్డుల కారణం గా దుర్వినియోగం అవుతున్నట్లు అంచనా. ఈ సమస్యను అధిగమించ డానికి ఎన్నికల సంఘం ఆధార్ అనుసంధానం, డిజిటల్ బయోమెట్రిక్ ధ్రువీకరణ, కేంద్ర జనన-మరణ నమోదుల విభాగం సమాచార వ్యవస్థలను సమన్వ యం చేసుకుంటూ, స్థానిక రెవెన్యూ యంత్రాంగం సాయంతో సమగ్ర ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది.

ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, బూత్ స్థాయి అధికారులు... ప్రతి ఇంటిని భౌతికంగా సందర్శించి, ఓటర్ల సజీవ స్థితిని ధ్రువీకరించేలా రూపకల్పన చేశారు. పౌరుల నుంచి అభ్యంతరాలను, సూచనలను స్వీకరించడానికి ప్రత్యేక గడువు లను ప్రకటించారు. ఇది పూర్తిగా నిష్పాక్షికమైన, చట్టబద్ధమైన పరిపా లనా ప్రక్రియ అని, ఇందులో ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేదని ఎన్నికల సంఘం గట్టిగా వాదిస్తోంది. అంతేకాకుండా, పారదర్శకతను నిరూపించేందుకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులను, బూత్ స్థాయి ఏజెంట్లను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేసి, సవరించిన డ్రాఫ్ట్ కాపీలను క్రమంతప్పకుండా పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేస్తోంది.

కానీ, క్షేత్రస్థాయి వాస్తవాలు, ప్రతిపక్షాల ఆందోళనలు మరో కోణాన్ని ఆవిష్కరి స్తున్నాయి. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్‌జేడీ వంటి ప్రధాన జాతీయ, ప్రాం తీయ శక్తులు ఎస్ఐఆర్ తుది ఫలితాలపై తీవ్ర అపనమ్మకాన్ని వ్యక్తపరు స్తున్నాయి. ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఇటువంటి భారీ ప్రక్షాళన చేపట్టడం వల్ల సమాజంలో వెనుకబడిన వర్గాలైన పేదలు, వలస కార్మికులు, గిరిజనులు, సంచార జాతులు, పట్టణ మురికివాడల ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తు న్నారు. నిరక్షరాస్యత, అవగాహనా లోపం కారణంగా వీరు నిర్ణీత సమయంలో అవసరమైన గుర్తింపు పత్రాలను సమర్పించలేరని, దీన్ని ఆసరాగా చేసుకుని అధికార పక్ష అనుకూల యంత్రాంగం ఉద్దేశ పూర్వకంగా ప్రతిపక్ష ఓటు బ్యాంక్‌ను నిర్వీర్యం చేసే అవకాశం ఉం దని ఆరోపిస్తున్నారు. తగిన పత్రాలు లేవనే సాకుతో లక్షలాది మంది నిరుపేద భారతీయ పౌరుల పేర్లను జాబితాల నుండి తొలగించడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనే అవుతుందని ప్రతిపక్షాలు గళమెత్తు తున్నాయి.

ఈ వివాదంలో అత్యంత కీలకమైన అంశం-ఎన్నికల సంఘం నిష్పాక్షికతపై వస్తున్న విమర్శలు. గత కొన్నేళ్లుగా ఎన్నికల షెడ్యూళ్ల ఖరారు, ఎన్నికల నియమావళి అమలు, ఈవీఎంల పనితీరు, విపక్ష నాయకులపై చర్యల వంటి విషయాల్లో ఎన్నికల సంఘం తీరు అధికార పక్షానికి అనుకూలంగా ఉందనే ఆరోపణలు దేశంలో బలంగా వినబడు తున్నాయి. ఈ నేపథ్యంలో, ఎస్ఐఆర్ వంటి సున్నితమైన ప్రక్రియను కూడా రాజకీయ విశ్లేషకులు, పౌర సమాజం అనుమానపు దృక్పథంతోనే పరిశీలిస్తున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికల నిర్వహణ సంస్థపై ప్రజలకు, రాజకీయ పక్షాలకు ఉండే అత్యున్నత విశ్వాసమే దానికి బలమైన పునాది. ఆ విశ్వసనీయత స్వల్పంగా దెబ్బతిన్నా, అది మొత్తం ఎన్నికల ఫలితాల ప్రామాణికతను, తద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థ స్థిరత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తుంది.

దీనికి భిన్నంగా అధికార పక్షమైన భారతీయ జనతా పార్టీ మరియు దాని మిత్రపక్షాలు ఈ సంస్కరణను గట్టిగా సమర్థిస్తున్నాయి. ఓటరు జాబితా స్వచ్ఛత అనేది పారదర్శక ప్రజాస్వామ్యానికి కనీస అవసరమని వారి వాదన. చనిపోయిన వారి పేరిట దొంగ ఓట్లు పడటం, సరిహద్దు రాష్ట్రాల్లో అక్రమ వలసదారులు దేశీయ ఓటరు కార్డులు పొందడం, ఒకే ఓటరు వేర్వేరు నియోజక వర్గాల్లో ప్రభావం చూపడం వంటి అక్రమాలను అడ్డుకోకపోతే, నిజాయితీ గల పౌరుడి ఓటుకు విలువ లేకుండా పోతుందని అధికార పక్షం పేర్కొంటోంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఓటరు జాబితాలను శుద్ధి చేయడం ద్వారా ఎన్నికల ఫలితాలపై దేశ ప్రజల్లో నమ్మకం మరింత పెరుగుతుందని, దీన్ని రాజకీయం చేయడం తగదని వారు హితవు పలుకుతున్నారు.

భారత ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే, ఓటరు జాబితాలపై వివాదాలు, ఆరోపణలు సరికొత్తవేమీ కావు. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ ముఖ్య ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పుడు ఫోటో గుర్తింపు కార్డులను (ఎపిక్) ప్రవేశపెట్టి నప్పుడు కూడా ఇలాంటి రాజకీయ అభ్యంతరాలు, సవాళ్లు ఎదురయ్యాయి. కాలక్రమేణా డిజిటలైజేషన్ పెరిగినప్పటికీ లోపాలు పూర్తిగా సమసిపోలేదు. 2015 బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ,




2018 తెలంగాణ ఎన్నికల్లో లక్షలాది మంది ఓట్లు అకస్మాత్తుగా మాయ మయ్యాయనే ఆరోపణలపైనా తీవ్ర దుమారం రేగింది. 2019 పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో, అలాగే 2024 సార్వత్రిక ఎన్నికల్లో సైతం కొన్ని నిర్దిష్ట వర్గాల ఓట్లను తొలగించారంటూ న్యాయస్థా నాల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. ఒకవైపు వేలాది మంది అర్హుల పేర్లు జాబితాలో కనిపించ కపోవడం, మరోవైపు బోగస్ ఓట్లు యథేచ్ఛగా చలామణి కావడం భారత ఎన్నికల వ్యవస్థ ఎదుర్కొం టున్న నిరంతర సవాళ్లుగా మిగిలి పోయాయి.

ఎన్నికల సంఘం తాజా నివేదికల ప్రకారం, ప్రతి శాస్త్రీయ సవరణ ప్రక్రియలో సగటున 1.5 నుండి 2 కోట్ల మంది కొత్త ఓటర్లు నమోదవుతుండగా, దాదాపు కోటికి పైగా అనర్హులైన లేదా మరణించిన వారి పేర్లు తొలగించబడుతున్నాయి. గతిశీలమైన భారత జనాభా రీత్యా ఈ ప్రక్రియను పూర్తిగా నిలిపివేయడం ఏ ప్రభుత్వానికైనా, వ్యవస్థకైనా అసాధ్యం. అయితే, ఈ సాంకేతిక ప్రక్షాళన వేగంలో ఏ ఒక్క నిజమైన పౌరుడి ప్రాథమిక ఓటు హక్కు కూడా హరించుకుపోకూడదనే రాజ్యాంగ స్ఫూర్తిని మరువరాదు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది కేవలం ఐదేళ్లకు ఒకసారి వేసే ముద్ర కాదు; అది పౌరుడి ఆత్మగౌరవానికి, దేశ సార్వభౌమాధికారంలో భాగస్వామ్యానికి ప్రతీక. అందువల్ల ఈ సవరణ ప్రక్రియలో అత్యంత అప్రమత్తత, మానవీయ కోణం అవసరం.

చివరగా, ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) ప్రజాస్వా మ్యాన్ని పరిరక్షించే పవిత్ర సంస్కరణగా నిలుస్తుందా, లేక కేవలం రాజకీయ వివాదాల కేంద్రబిందువుగానే మిగిలి పోతుందా అనేది అది క్షేత్రస్థాయిలో అమలయ్యే తీరుపైనే పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ఈ ప్రక్రియ విజయవంతం కావాలంటే, ఎన్నికల సంఘం కేవలం పరిపాలనాపరమైన మొండితనంతో కాకుండా, సంపూర్ణ పారదర్శకతతో వ్యవహరిం చాలి. జాబితా నుండి ఏ ఒక్క పేరును తొలగించినా, అందుకు గల నిర్దిష్ట కారణాలను, ఆధారాలను బహిరంగపరచాలి. అభ్యం తరాలు తెలపడానికి, తప్పులను సరిదిద్దుకోవడానికి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పౌరులకు గడువును, తగినంత ప్రచారాన్ని విస్తృతంగా కల్పించాలి. కేవలం రాజకీయ పక్షాలపైనే కాకుండా స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజ ప్రతినిధుల పర్యవేక్షణను కూడా అనుమతించాలి. ఎన్నికల సంఘం యొక్క నిష్పాక్షికత, రాజకీయ పార్టీల బాధ్యతాయుతమైన సహకారం, ప్రజల అప్రమత్తత సమ్మిళితమైనప్పుడే ఓటరు జాబితాలు పవిత్రంగా, విశ్వసనీయంగా మారుతాయి. లేనిపక్షంలో, ప్రతి ఎన్నికల ముందు పునరావృతమయ్యే ఈ అనుమానాలు, ఆరోపణలు దేశ ప్రజాస్వామ్య పునాదులను బలహీనపరిచే ప్రమాదముంది.

వ్యాసకర్త : సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్.

# గ్యాస్ వినియోగదారులకు మెలిక

## 30లోగా కెవైసీ, బయోమెట్రిక్ చేసుకోవాలి

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, జూన్ 17 : వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉజ్వల పథకం లబ్దిదారులతో పాటు సబ్సిడీ పొందుతున్న సాధారణ గ్యాస్ వినియోగదారులు కూడా జూన్ 30 లోగా తమ బయోమెట్రిక్ పక్రియను కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ గడువులోగా బయోమెట్రిక్ పూర్తి చేయని వారి ఖాతాల్లో సబ్సిడీ జమ కాకుండా నిలిపివేయనున్నారు. ఏడాదిగా ఈ-కేవైసీ పక్రియ కొనసాగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ నెల 30లోపు పూర్తి చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఒకవేళ జూన్ 30 గడువు దాటిన తర్వాత బయోమెట్రిక్ పూర్తి చేసుకుంటే.. ఆ తేదీ తర్వాత తీసుకునే సిలిండర్లకు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. గడువు ముగిసిన రోజు నుంచి బయోమెట్రిక్ పూర్తయ్యే మధ్య కాలంలో తీసుకునే సిలిండర్లపై సబ్సిడీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని కేంద్రం తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మే 18న జారీ చేసిన ప్రకటన ప్రకారం.. బయోమెట్రిక్ పక్రియ పూర్తి కాలేదనే నెపంతో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల సరఫరాను మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదు. అయితే, క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం.. బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి సిలిండర్ల డెలివరీని ఆలస్యం చేయాలని లేదా నిలిపివేయాలని ఆయిల్ కంపెనీల నుంచి గ్యాస్ డీలర్లకు అనధికారిక ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడంతో, ఇటీవల జూన్ 7న సిలిండర్ ధరను రూ.29 మేర పెంచారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సబ్సిడీ లేని గృహోపయోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.994 పలుకుతోంది. కేంద్రం ఉజ్వల పథకం కింద ప్రతి సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ ఇస్తుండగా, మిగిలిన అర్హులైన సాధారణ వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో స్వల్ప మొత్తంలో సబ్సిడీ జమ అవుతోంది. మరోవైపు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. రాష్ట్రంలో సుమారు 1.26 లక్షలకు పైగా క్రియాశీలక గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోని వారి వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పంచుకోనున్నాయి. గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయని వారు వెంటనే తమ పరిధిలోని గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈ పక్రియను పూర్తి చేసుకోవాలి. జూన్ 30 లోగా ఈ పని పూర్తి చేసుకుంటేనే ఎలాంటి అంతరాయం లేకుండా సబ్సిడీ డబ్బులు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయి. గ్యాస్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు ముఖ గుర్తింపు, వేలిముద్రలు లేదా ఐరిస్ వంటి మూడు విధానాలతో ఎల్‌పీజీ వినియోగదారుల ఈ-కేవైసీని పూర్తి చేయనున్నారు. ఈ పక్రియ కోసం వినియోగదారులే నేరుగా ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. గ్యాస్ ఏజెన్సీల డీలర్ల వద్ద ఈ-కేవైసీ పూర్తి చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీలు గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలోనే ఈ పక్రియను పూర్తి చేస్తున్నాయి.

# హైదరాబాద్‌లో రోడ్డుకు ట్రంప్ పేరు సరికాదు

### - ఒక నియంత పేరు పెట్టడం ఎంతవరకు సబబు

### - సిఎం రేవంత్ నిర్ణయాన్ని తప్పపట్టిన సిపిఎం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, జూన్ 17 : హైదరాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం పక్కన ఉన్న రహదారికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేరు పెట్టాలన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నిర్ణయాన్ని సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబి తీవ్రంగా వ్యతిరేకించారు. ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో వియత్నాంపై అమెరికా యుద్ధం ఉధృతంగా సాగుతున్న సమయంలో, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట నేత చిమిన్ గౌరవార్థం కోల్‌కతాలోని అమెరికా రాయబార కార్యాలయం వెలుపల ఉన్న హారింగ్టన్ వీధికి ఆయన పేరు పెట్టారని ఈ సందర్భంగా బేబి గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాలంలో అమెరికా.. ఇరాన్‌పై యుద్ధ వాతావరణాన్ని సృష్టించడం, వెనిజులాలో సైనిక జోక్యానికి పాల్పడటం, క్యూబాపై ఆంక్షలతో దౌర్జన్యం చేయడం వంటి చర్యల ద్వారా మానవాళిపై సామ్రాజ్యవాద దురాక్రమణకు ప్రతీకగా నిలుస్తోందని ఆయన విమర్శించారు. నేటి కాలపు హిట్లర్‌లా మారాలని ఆకాంక్షిస్తున్న ట్రంప్‌ను గౌరవిస్తూ, తెలంగాణ ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ పక్కన ఉన్న రహదారికి ఆయన పేరు పెట్టాలని నిర్ణయించడం సరికాదని దుయ్యబట్టారు. ఇటీవల అమెరికా సైన్యం ఒక నిరాయుధ వాణిజ్య నౌకపై దాడి చేసి ముగ్గురు భారతీయ నావికులను హతమార్చిందని ఆయన ఆరోపించారు. అమెరికా ప్రభుత్వం ఇటువంటి దాడులను కొనసాగిస్తామని బెదిరిస్తున్నప్పటికీ, ఈ దారుణమైన క్షిపణి దాడిపై భారత ప్రభుత్వం తగిన రీతిలో నిరసన వ్యక్తం చేయలేదని, ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఈ విషయంపై స్పందించడానికి నిరాకరించారని అన్నారు. దీన్నిబట్టి దేశ సార్వభౌమత్వాన్ని, ఆత్మగౌరవాన్ని వదులుకోవడానికి బిజెపికి ఎటువంటి సంకోచం లేదని స్పష్టమవు తోందని, ఇప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తు న్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. ఈ వివాదాస్పద నిర్ణయాన్ని ఉప సంహరించు కునేలా కాంగ్రెస్ అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకోవాలని తాను ఆశిస్తున్నట్లు ఎం.ఎ. బేబి పేర్కొన్నారు. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ చేసే తీర్మానాలు కేవలం మాటలకే పరిమితం కాకూడదని, ఆచరణలో చూపాలని ఆయన సూచించారు.

# ప్రజా సేవలో పద్మావతి ఉత్తమ్‌కు సాటి లేరు

**- రూ.1938 కోట్లతో కోదాడ అభివృద్ధికి కొత్త దిశ..**

**- మహిళా నాయకత్వానికి ఆదర్శం : ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోదాడ, జూన్ 17 : ప్రజాసేవను పరమావధిగా భావిస్తూ కోదాడ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే నలమాద పద్మావతి ఉత్తమ్ రెడ్డి జన్మదిన వేడుకలను మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ రెడ్డి మహిళా నాయకత్వానికి నిలువెత్తు నిదర్శనమని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఆమె చూపుతున్న చొరవ, అభివృద్ధి పట్ల ఉన్న నిబద్ధత, ప్రజల పట్ల ఉన్న అంకితభావం ఆమెను ప్రత్యేక నాయకురాలిగా నిలబెట్టాయని పేర్కొన్నారు. కోదాడ నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సుమారు రూ.1938 కోట్ల నిధులను తీసుకువచ్చి రహదారులు, తాగునీటి సదుపాయాలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పట్టణ మౌలిక వసతుల కల్పనలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ప్రగతి ప్రదాతగా పద్మావతి ఉత్తమ్ రెడ్డి నిలిచారని కొనియాడారు. ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకునేందుకు నిరంతరం ప్రజల్లో ఉంటూ, ప్రతి వర్గానికి అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకురాలిగా ఆమె విశేష గుర్తింపు పొందారని తెలిపారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత, పారదర్శకతకు ప్రతీకగా నిలుస్తూ ప్రజా విశ్వాసాన్ని చూరగొన్న ప్రజానాయకురాలని పేర్కొన్నారు. గ్రామాలు, తండాలు, పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ, సామాన్య ప్రజలకు అండగా నిలుస్తూ నిస్వార్థ సేవతో రాజకీయాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, కోదాడ అభివృద్ధికి ఆమె చేస్తున్న కృషి మరింత విజయవంతం కావాలని, భగవంతుడు ఆమెకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించగా పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కౌన్సిలర్లు కట్టబోయిన జ్యోతి శ్రీనివాస్, పాశం శ్రీనివాస్, నాగేంద్రమ్మ, కాంగ్రెస్ నాయకులు ఉప్పగండ్ల శ్రీనివాసరావు, రావెళ్ల కృష్ణారావు, మైలారిశెట్టి భాస్కర్, మట్టపల్లి సాలయ్య, నెమ్మది దేవమని, ప్రకాష్ బాబు, వంటిపులి శ్రీనివాస్, వేమూరి విద్యాసాగర్, గంధం పాండు తదితరులు పాల్గొన్నారు.

# భద్రతలో రాజీ పడకుండా యంత్రాల పనిగంటలు పెంచి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలి

**- 65 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనకు సమష్టి కృషి అవసరం**

**- మణుగూరులో 19వ ఏరియా స్థాయి త్రైపాక్షిక రక్షణ సమావేశంలో సింగరేణి డైరెక్టర్ల దిశానిర్దేశం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మణుగూరు, జూన్ 17 : కోల్ ఇండియాతో పోలిస్తే సింగరేణి బొగ్గు ధరలు అధికంగా ఉండటంతో మార్కెట్‌లో పోటీ పెరుగుతోందని, ఈ పరిస్థితుల్లో సంస్థ నిర్దేశించిన రక్షణ సూత్రాలను కచ్చితంగా పాటిస్తూనే యంత్రాల పనిగంటలను పెంచి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాలని సింగరేణి డైరెక్టర్ (పిడిపి) కొప్పుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. భద్రతలో ఎక్కడా రాజీ పడకుండా, వ్యయ నియంత్రణతో కూడిన ఉత్పత్తిని సాధించినప్పుడే సంస్థ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. సింగరేణి మణుగూరు ఏరియాలోని ఇల్లందు క్లబ్‌లో బుధవారం నిర్వహించిన 19వ ఏరియా స్థాయి త్రైపాక్షిక రక్షణ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. సమావేశానికి డైరెక్టర్ (మైనింగ్) డా. ఐ. సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకాగా, డిప్యూటీ డైరెక్టర్ (మైనింగ్) టి. హరిప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్ (ఎలక్ట్రికల్) ఎస్‌కే నాగుల్ మీరా, డిప్యూటీ డైరెక్టర్ (మెకానికల్) సుధీర్ కుమార్ బొల్ల, మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, జీఎం (సేఫ్టీ-కార్పొరేట్) కే. సాయిబాబు, కొత్తగూడెం రీజియన్ జీఎం (సేఫ్టీ) కృష్ణగోపాల్ తివారీ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు వి. కృష్ణంరాజు, సీఎంఓఏఐ ప్రధాన కార్యదర్శి వి. మదన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన సమావేశంలో విధి నిర్వహణలో అమరులైన సింగరేణి ఉద్యోగులకు నివాళులర్పిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించారు. అనంతరం రక్షణ ప్రతిజ్ఞతో సమావేశ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. సమావేశంలో ప్రసంగించిన డైరెక్టర్ (మైనింగ్) డా. ఐ. సత్యనారాయణ, 18వ ఏరియా స్థాయి త్రైపాక్షిక రక్షణ సమావేశంలో గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఏడాది తప్పనిసరిగా త్రైపాక్షిక రక్షణ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి గనిలో భద్రతపై శాస్త్రీయ అధ్యయనాలు నిర్వహించి ఉద్యోగుల్లో భద్రతా అవగాహన పెంపొందించాలని తెలిపారు. కాంట్రాక్టర్లు, యాజమాన్యం మధ్య సమాచార వ్యవస్థను మరింత మెరుగుపరచాలని సూచించారు. రాత్రి పూట విధులు నిర్వహించే ఉద్యోగుల భద్రత దృష్ట్యా లైటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఆదేశించారు. సింగరేణి ఉద్యోగులతో పాటు ఓబీ ప్రాంతాల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల భద్రత, వారికి చెల్లిస్తున్న వేతనాలు, కల్పిస్తున్న సౌకర్యాలపై కూడా డైరెక్టర్ (మైనింగ్) ప్రత్యేకంగా ఆరా తీశారు. ఏరియాలో అమలు చేస్తున్న భద్రతా చర్యలపై ఎస్వో టు జీఎం డి.వి. రామారావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భద్రతా అంశాలపై మణుగూరు ఏరియా చూపుతున్న చొరవపై డీజీఎంఎస్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, కార్మికుల ఆరోగ్యం, భద్రతపై నిరంతర సమీక్ష కొనసాగించాలని సూచించారు. అధ్యక్షోపన్యాసంలో డైరెక్టర్ (పిడిపి) కొప్పుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగి తన భద్రతకు తానే బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కువ శాతం ప్రమాదాలు నిర్లక్ష్యం కారణంగానే జరుగుతున్నాయని, గనుల్లో జరిగే ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల ద్వారానే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ ఉత్పత్తిపై ఆధారపడకుండా డిపార్ట్‌మెంటల్ ఉత్పత్తిని పెంచాలని, కేసీహెచ్‌పీలో ధూళి నివారణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఉద్యోగులందరూ అన్ని రకాల వృత్తి నైపుణ్య శిక్షణలు పొందడం ద్వారా పనిలో సామర్థ్యాన్ని పెంచుకోవాలని కోరారు. 2026-27 సంవత్సరానికి నిర్దేశించిన 65 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించేందుకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జీఎం (సేఫ్టీ-కార్పొరేట్) కే. సాయిబాబు మాట్లాడుతూ, భద్రత పట్ల ప్రతి ఉద్యోగి వ్యక్తిగత బాధ్యత కలిగి ఉండాలని చెప్పారు. 18వ సేఫ్టీ రివ్యూ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో అధిక శాతం అమలు చేసినందుకు మణుగూరు ఏరియా యాజమాన్యాన్ని అభినందించారు. ఈపీ, వాల్వో ఆపరేటర్లకు సిమ్యులేటర్ ఆధారిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారి వృత్తి నైపుణ్యాన్ని పెంచాలని సూచించారు. 2026-27లో ప్రమాదరహిత సింగరేణి లక్ష్య సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ మాట్లాడుతూ, ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు భద్రతకు సమాన ప్రాధాన్యం ఇస్తూ పనిస్థలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదరహిత ఉత్పత్తి కోసం ముందస్తు చర్యలు చేపడుతున్నామని, దీంతో మణుగూరు ఏరియాలో ప్రమాదాలను పూర్తిగా నివారించగలమనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. యాజమాన్యం అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ప్రమాద సూచనలను ముందుగానే గుర్తించి అధికారుల దృష్టికి తీసుకురావడంలో వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్వైజర్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్ మాట్లాడుతూ, ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు కార్మికుల భద్రత, సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు మణుగూరు ఏరియాలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నందుకు యాజమాన్యాన్ని అభినందించారు. యూనియన్ సూచనలను పరిగణనలోకి తీసుకుని సమస్యల పరిష్కారానికి ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తక్షణ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రశాంతత, ఉత్పత్తి, రవాణా రంగాల్లో మణుగూరు ఏరియా ప్రత్యేకతను చాటుకుంటోందన్నారు. ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు వి. కృష్ణంరాజు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, కార్మిక సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ యాజమాన్యం చేపడుతున్న చర్యలను ప్రశంసించారు. చర్చా వేదికలో వివిధ గనుల వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, సూపర్వైజర్లు, ప్రైవేట్ కాంట్రాక్ట్ కంపెనీల ప్రతినిధులు, యూనియన్ నాయకులు పాల్గొని 18వ త్రైపాక్షిక రక్షణ సమావేశంలో గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కార పురోగతిపై సవివరంగా చర్చించారు. రక్షణ, ఉత్పత్తి, కార్మిక సంక్షేమ అంశాలపై విస్తృత చర్చల అనంతరం జాతీయ గీతాలాపనతో సమావేశం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం డి.వి. రామారావు, ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేశ్, ఏజీఎం (ఐఈడీ) సీహెచ్. రాంబాబు, పీవో-పీకేఓసీ బి. శ్రీనివాసచారి, పీవో-ఎంఎన్‌ఓసీ ఈ. శ్రీనివాస్, డిప్యూటీ సీఎంఓ జ్యోతిర్మయి, ఏరియా సేఫ్టీ అధికారి రామన్ వి. పాఠక్, డీజీఎం (సివిల్) జి. శివప్రసాద్, డీజీఎం (ఈఎం) టి. శ్రీకాంత్, డీజీఎం (సర్వే) ఎల్. దయాకర్, ఫైనాన్స్ మేనేజర్ పి. రమేశ్‌బాబు, ఏరియా సెక్యూరిటీ అధికారి కె. శ్రీనివాస్, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ సాయిల సురేశ్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ శ్యాంప్రసాద్‌తో పాటు ఉన్నతాధికారులు, సేఫ్టీ అధికారులు, అన్ని గనుల వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు, ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కుష్ఠు వ్యాధి నిర్మూలన, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలి

**- మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలి**

**- జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 17: జిల్లాలో కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్ఓ అధ్యక్షతన జిల్లా కుష్ఠు నిర్మూలన కార్యక్రమాలపై డిపిఎంఓలు (లెప్రసీ), హెల్త్ ఎడ్యుకేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, కుష్ఠు వ్యాధి అనుమానితులను త్వరితగతిన గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే మల్టీ డ్రగ్ థెరపీ (ఎండీటీ) చికిత్స ప్రారంభించి, పూర్తి కోర్సు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో యాక్టివ్ కేస్ సెర్చ్, కాంటాక్ట్ సర్వేలు, ఫాలోఅప్ పర్యవేక్షణ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించేలా ప్రజలను చైతన్యపరచాలని హెల్త్ ఎడ్యుకేటర్లకు సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత చికిత్స, వైకల్య నివారణ చర్యలు, స్వీయ సంరక్షణ (సెల్ఫ్ కేర్) పద్ధతులపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలు, గ్రామ సభలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ ఆరోగ్య పారిశుద్ధ్య మరియు పోషణ కమిటీ సమావేశాల ద్వారా ఆరోగ్య విద్యను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఐఈసీ, బీసీసీ కార్యక్రమాలను బలోపేతం చేయడంతో పాటు క్షేత్రస్థాయిలో రికార్డులు, నివేదికలను సకాలంలో నవీకరించాలని, నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో చేతబడి, బాణామతి, క్షుద్రపూజలు వంటి మూఢనమ్మకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేలా ఆరోగ్య విద్యా కార్యక్రమాలు నిర్వహించాలని హెల్త్ ఎడ్యుకేటర్లకు సూచించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రతాప్, ఫిజియోథెరపిస్ట్ భద్రు, మోహన్, శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్లు జయలక్ష్మి, రమాదేవి, బేబీ, వినయ్ కుమార్, ప్రతిభ తదితరులు, జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

# గిరిజనులు, గిరిజనేతరుల మధ్య చిచ్చు పెట్టొద్దు

**- సిపిఎం జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (ఏటూరునాగారం) జూన్ 17, ములుగు జిల్లాలోని ఏటూరు నాగారం మండలంలో భూ వివాదంలో గిరిజనులు, గిరిజనేతరుల మధ్య కొంతమంది చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఇది సరైనది కాదు అని సీపీఎం జిల్లా కార్యదర్శి బిరెడ్డి సాంబశివ అన్నారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో రత్నం రాజేందర్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది ఈ సమావేశంలో సాంబశివ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా గిరిజనులు,గిరిజనేతరులు ఐకమత్యంతో కలిసిమెలిసి ఉంటున్నారని భూముల విషయంలో వారి మధ్య వైశ్యమ్యాలని పెంచే విధంగా కొందరు ప్రయత్నాలు చేయడం ఆపాలని అన్నారు.నిరుపేదలకు భూములు దక్కాలని సిపిఎం పార్టీ నిరంతరం పోరాటాలు చేస్తున్నదని అందులో గిరిజనులైన,గిరిజనేతరులలో నైనా పేదవారు ఉంటే న్యాయం చేయాలని అన్నారు.ఇండ్ల స్థలం లేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వమే ఇండ్ల స్థలం ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. కాస్తూ , కబ్జాలో ఉన్న పేదవారినీ గుర్తించి ప్రభుత్వం హక్కులు కల్పించాలని అన్నారు. పేద ప్రజల మధ్య కుల మత వైషమ్యాలు రెచ్చగొట్టే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి,రత్నం ప్రవీణ్,కలవల రవీందర్, కుర్ర రాజు, రవి గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 17 : ప్రభుత్వ ఆసుపత్రికి వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, సిబ్బంది హాజరు రిజిస్టర్, వైద్యులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు నమోదు వివరాలను పరిశీలించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రజలను వైద్యులు అందిస్తున్న సేవలు, పాలు, బ్రెడ్డు, అల్పాహారం, భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి లోని వార్డులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. మారుమూల గిరిజన గ్రామాల నుండి చికిత్సల కొరకు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. ప్రతిరోజు ఆసుపత్రిలో సేవలు పొంది డిశ్చార్జ్ అవుతున్న రిజిస్టర్ ను పరిశీలించిన అనంతరం ఆసుపత్రి బయట రహదారి పైగల మురుగు కాలువలలో చెత్తను వెంటనే తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఆసుపత్రి పర్యవేక్షకులు ప్రవీణ్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బాసర, ముధోల్ మండల కేంద్రాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**- ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 17 : బాసర మండల కేంద్రంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, అనంతరం ముధోల్ మండల కేంద్రంలో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనానికి శంకుస్థాపన, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) నిధులతో రూ. 1 కోటి వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా గ్రామ పరిశుభ్రతను మరింత మెరుగుపర్చేందుకు చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన నూతన వాహనాలను ప్రారంభించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిష్ఠాత్మక గృహ నిర్మాణ పథకమైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో మరమ్మతులు చేపట్టి ఆధునీకరించిన పోస్టుమార్టం గదులను పునఃప్రారంభించారు. గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన నూతన బోర్‌వెల్‌ను కూడా ప్రారంభించారు. ముధోల్ లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన ఎమ్మెల్యే, ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు, మౌలిక వసతులు, పారిశుధ్య సదుపాయాలు, తాగునీటి సౌకర్యాలు అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




# ప్రతి ఒక్కరూ ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ కె.హరిత**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 17 : జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరూ తపాలా శాఖలో ప్రధాన మంత్రి జీవనజ్యోతి భీమా యోజన పాలసీ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల పాలన అధికారి ఛాంబర్ లో జీవన్ జ్యోతి బీమా దారుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మంచిర్యాల బ్రాంచ్ లో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన క్రింద బెజ్జూర్ మండలం మొగవెల్లి గ్రామానికి చెందిన సిహెచ్. లక్ష్మి మరణించినందున నామిని అయిన పెంటు బాయికి 2 లక్షల రూపాయల చెక్కు అందించడం జరిగిందని తెలిపారు. అదే గ్రామానికి చెందిన కనక కమల రాయల్ సుందరం పథకంలో 565 రూపాయలు ప్రీమియం చెల్లించి బీమా చేసుకున్నారని, సదరు కమల ప్రమాదవశాత్తు పాముకాటుకు గురై మరణించారని, ఈమె కుమారుడు కనక సుధాకర్ కు 10 లక్షల రూపాయల బీమా చెక్కును అందించడం జరిగిందని తెలిపారు. తపాలా శాఖలో కేవలం సంవత్సరానికి 565 రూపాయల ప్రీమియం చెల్లించి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన క్రింద బీమా చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, 18-65 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ సీనియర్ మేనేజర్ కొట్టె శ్రీనివాస్, మేనేజర్ సాగర్, రాయల్ సుందరం కంపెనీ రీజనల్ మేనేజర్ ధన్ రాజ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాల మధ్య ఘనంగా పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలు

**- కేక్ కటింగ్, అన్నదానం, రక్తదాన శిబిరాలతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోదాడ, జూన్ 17 : కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి జన్మదిన వేడుకలు కోదాడ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహిం చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమం చేపట్టడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కారింగుల అంజన్ గౌడ్, పారా సీతయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, ప్రజా సేవలో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కోదాడ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆమె నిరంతరం కృషి చేస్తున్నా రని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారని కొనియా డారు. నియోజకవర్గ ప్రజలతో కుటుంబ సభ్యురాలిలా మమేకమై సేవలు అందిస్తున్న నాయకురాలిగా పద్మావతి రెడ్డికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. జన్మదిన వేడుకల సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పాలు, బ్రెడ్, పండ్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే నిర్వహించిన రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ప్రజా సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలను నిర్వహించడం పద్మావతి రెడ్డి సేవా దృక్పథానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. కోదాడ పట్టణంలో పండుగ వాతావరణం నెలకొనగా, కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# చౌటుప్పల్‌లో ఎస్ఎఫ్ఐ నేతలపై పోలీసుల దాడిని ఖండించిన ఎస్ఎఫ్ఐ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 17 : చౌటుప్పల్‌లోని త్రినిటీ ప్రైవేట్ పాఠశాలలో విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసుల ద్వారా దాడి చేయించడం ఖండనీయమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, జిల్లా కార్యదర్శి లావుడియ రాజు అన్నారు. త్రినిటీ విద్యాసంస్థ గుర్తింపును రద్దు చేసి, ఘటనపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలలో అనుమతులు లేకుండా స్టేషనరీ, టైలు, బెల్టులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు విక్రయిస్తున్నారనే సమాచారంతో చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నిరసన తెలుపుతున్న విద్యార్థి నాయకులపై పోలీసుల ద్వారా దాడి చేయించడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు, స్టేషనరీ పేరుతో జరుగుతున్న దోపిడీపై జిల్లా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట విద్యార్థులతో భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు హిందురాణి, పట్టణ అధ్యక్షుడు ఎండి నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయం అభివృద్ధికి సహకరిస్తాను

**- బిఆర్ఎస్ నేత వ్యాల్ల హరీష్ రెడ్డి**

**- రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేత**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూన్ 17 :శ్రీ పాటి అభయాంజ నేయ స్వామి దేవాలయం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని బిఆర్ఎస్ రాష్ట్ర నేత వ్యాల్ల హరీష్ రెడ్డి అన్నారు. జన గామ గ్రామం లో బుధవారం ఆంజనేయ దేవాలయంను దర్శించు కున్నారు. ఈ దేవాలయం అభివృద్ధి పనుల కోసం ఆలయ కమిటీ అధ్యక్షులు నడిపెల్లి గోపాలరావు, జనగామ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్యామల,రమేష్ బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించి న హరీష్ రెడ్డి దేవాలయ అభివృద్ధి కోసం రూ. 30,000 ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రాలు సమాజంలో ఐక్యతను పెంపొం దించడంతో పాటు సనాతన ధర్మ పరిరక్షణకు దేవాలయలు దోహద పడతాయని అన్నారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నీలం సంజీవ్ పటేల్, ఆరేళ్ల రవితేజ, పోలాడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని హరీష్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి స్థానిక ప్రజలు, దాతలు ముందుకు రావాలని వారు కోరారు.

# ఓల మర్లగొండ మీదుగా ఉమ్మర్‌కేడ్‌కు బస్సు సౌకర్యం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్,జూన్ 17 : ఆర్టీసీ నిర్మల్ డిపో నుండి ప్రతి రోజు ఉద యం 07.30 ని!! లకు నిర్మల్ బస్టాండ్ నుండి బయలుదేరి కల్లూరు, కుంటాల, ఓల, లింబా, పార్డి బి, మార్లగొండ, తోటంబ, కోస్‌మెట్, ఇస్లాపూర్, హిమా యత్ నగర్ గుండా ఉమ్మర్ ఖేడ్ పల్లెవెలుగు బస్సు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ కే పండరి తెలిపారు. తిరిగి ఉమ్మార్ఖేడ్ నుండి 11:40 నిముషములకు నిర్మల్‌కు బయలు దేరు తుందని ఆయన తెలిపారు. ఈ రూట్లో బస్సులు లేనందున మహా రాష్ట్ర ప్రజల కోరిక మేరకు ఈ బస్సు నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు ఈ సదవకాశాన్ని సద్వినియోగ పరచు కోవాలని ఆయన సూచించారు.

# జనవాసాల మధ్య మురికి నీటి గుంట

**- మురికి నీటి గుంట తొలగించాలని కోరుతున్న జనం**

**- విద్యార్థులకు తప్పని కష్టాలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్, జూన్ 17 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో జనవాసాల మధ్య ఉన్నటువంటి మురికి నీటి గుం టను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ మురికి నీటి గుంట ప్రక్కన అంగన్వాడి కేంద్రము, ప్రాథమిక పాఠశాల ఉన్నాయని,మురికి నీటి గుంట నుండి వచ్చే వాసనతో ప్రజలు, విద్యార్థులు సతమతమవుతున్నారని అక్కడి కాలనీవాసులు కొందరు తెలిపినారు. మున్సిపాలిటీ అధికారులు తక్షణమే స్పందించి, మురికి నీటి గుంటను తొలగించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 17 : పట్టణంలోని 25వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణ పనులకు కోరుట్ల మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ బుధవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమం లో స్థానిక వార్డు కౌన్సిలర్ కలాల రాధ సాయిచంద్, మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర, డీఈఈ అరుణ్ కుమార్, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటిలో సీటు సాధించిన విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్,జూన్ 17 : నిర్మల్ జిల్లా తానూర్ మండలంలోని ఎల్వి గ్రామానికి చెందిన బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి యాతలం చిన్నారెడ్డి కుమార్తె యాతలం దీక్షిత రెడ్డి ఐఐటిలో సీటు సాధించడం తో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ విద్యార్థిని అభినందించి శాలు వాతో సత్కరించారు. దేశంలోనే ప్రతిష్టాత్మక విద్యా సంస్థలైన ఐఐటీల్లో మన ప్రాంత విద్యార్థులు ప్రవేశాలు పొందడం శుభ పరిణామం అన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు సోలంకి భీమ్ రావ్, వెంగల్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా, నిబంధనల మేరకు సర్వే నిర్వహించాలి

**- నక్ష సర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 17: మహబూబాబాద్ పట్టణంలో నక్ష సర్వే పైలట్ ప్రాజెక్టు కింద కొనసాగుతున్న ఇంటి స్థలాల సర్వే పనులను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ బుధవారం సాయంత్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గుమ్మడూరు, జామండ్లపల్లి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వ నిబంధనలకు అనుగు ణంగా పనులు పారదర్శకంగా నిర్వహించాలని అధికారు లను ఆదేశించారు. సర్వేలో ఖచ్చితత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా నమోదు చేసి ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న సర్వే పనుల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వివాదాలకు తావులేకుండా సర్వే ప్రక్రియ ను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, తహసీల్దార్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్‌లు సర్వే పనుల పురోగతిపై కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు నక్ష సర్వే పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# పాఠశాల,కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక తనిఖీలు



**- పాఠశాల బస్సులు నిబంధనలకు అనుగుణంగా ఉండాలి**

**- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 17 : మెదక్ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు,కళాశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ జిల్లా పోలీసు శాఖ,రవాణా శాఖ సంయుక్తంగా పాఠశాల, కళాశాల బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాయి.

జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు జిల్లాలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌ఓలు తమ పరిధిలోని విద్యాసంస్థల బస్సులను రవాణా శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేస్తున్నారు. ఈ తనిఖీల్లో బస్సుల ఫిట్‌నెస్, బ్రేకులు,టైర్ల పరిస్థితి,ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్,ఎమర్జెన్సీ డోర్, జీపీఎస్,సీసీ కెమెరాలు తదితర భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిర్దేశిత నిబంధనలను పాటించని వాహనాలపై మోటారు వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని సంబంధిత విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యమని పేర్కొన్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, పాఠశాల యాజమాన్యాలు, కళాశాలల నిర్వాహకులు మరియు వాహన యజమానులు అన్ని భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ఫిట్‌నెస్ లేని వాహనాలను విద్యార్థుల రవాణాకు వినియోగించరాదని సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన ప్రయాణ వాతావరణం కల్పించేందుకు అన్ని విద్యాసంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

# కేన్ రక్షిత ప్రాంతంలో దేశీయ మొక్కలను నాటాలి



**వృక్షశాస్త్రవేత్త డా. సుతారి సతీష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (వెంకటాపూర్), జూన్ 17 : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామ శివారులో 53 ఎకరాల 'కేన్' రక్షిత ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా దేశీయ మొక్కలను నాటి,కేన్ ప్రాంతం పచ్చదనంతో పరిఢవిల్లేలా చేయాలని వృక్షశాస్త్రవేత్త,కేన్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ డా.సుతారి సతీష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడా లేని,అరుదైన కేన్ మొక్కలు మన ప్రాంతంలోనే ఉన్నాయని,వాటిని కాపాడి భవిష్యత్ తరాలకు అందజేయాలని కోరారు. ఈ వానాకాలం సమయంలో రేపటి నుండి రాష్ట్రం మొత్తం చేపడుతున్న వనమహోత్సవంలో భాగంగా కేన్ రక్షిత ప్రాంతంలో స్థానిక మొక్కలైన టేకు,తెల్లమద్ది, నల్లమద్ది,ఉసిరి,తానిక్కాయ, కరక్కాయ, వెలగ, మారేడు, ఇప్ప, నేరేడు, మొర్రి, పూసుకు, బుడదర్మి లాంటి వాటితో పాటు కేన్ మొక్కల కొమ్ములను కూడా విస్తారంగా నాటి, కేన్ ప్రాంతం చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. జిల్లాలో అటవీశాఖ ద్వారా పెట్టుకున్న 3.5 లక్షల మొక్కలు నాటే లక్ష్యంలో కనీసం ఒక వేయి స్థానిక మొక్కలను కేన్ రక్షిత ప్రాంతంలో నాటి సంరక్షించాలని,ఈ విషయంలో అటవీ అధికారులు కొంచెం చొరవ చూపాలని డా.సతీష్ కోరారు.

# బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా



**రామగుండం మేయర్ మహంకాళి స్వామి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూన్ 17 : బహిరంగ ప్రదేశాలలో చెత్త పడవేస్తే రేపటి నుండి జరిమానా విధిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా బుధవారం డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ తో కలిసి 46వ డివిజన్ ఇందిరా నగర్ లో పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు, కాలువల్లో చెత్త పడవేసే వారి ఫోటోలు తీసి చెత్త పరిమాణానికి అనుగుణంగా జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. వర్షా కాలంలో వరద ముంచెత్తకుండా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గత మూడు నెలలుగా ప్రదాన కాలువల్లో పూడిక తొలగిస్తున్నామని అన్నారు. ఆర్ఎఫ్‌సిఎల్ నుండి వచ్చేనీటితో వర్షాకాలంలో నీళ్ళు ఇందిరానగర్‌లోని ఇళ్ళల్లోకి వస్తున్న నేపథ్యంలో నివారణా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రజలు సహకరించి రోడ్లు, కాలువలఅబ ఆక్రమించి నిర్మించిన కట్టడాలు స్వచ్ఛందంగా తొలగించాలని అన్నారు. ప్రతి వీధిలో చివరి ఇంటి వరకు అన్ని మౌళిక వసతులు కల్పించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వచ్చేలా వీదులు విశాలంగా ఉంచాలని ఎమ్మెల్యే జారీ చేసిన ఆదేశాల మేరకు చెట్ల కొమ్మలు , పొదలు తొలగిస్తున్నామని అన్నారు. త్వరలోనే ఇందిరానగర్‌లో యుజిడి, రోడ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు నాడుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. కాగా ఈ సందర్భంగా స్థానిక ఉన్న ఒక మధ్యశీ దుకాణం ఎదుట రోడ్డు పై నిర్మించిన ఆక్రమణ తొలగించారు. ఖాళీ సీసాలను కాలువలో పడవేసిన సదరు దుకాణ యజమానికి భారీ జరిమానా విధిస్తూ నోటీసు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు దాసరి సాంబ మూర్తి , చిదురాల నాగ రాజు, వడ్లూరి రవి, పాటు టిపిఎస్ నవీన్, ఎఇ, మనోజ్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, సానిటరి ఇన్స్ పెక్టర్ సంపత్, మెప్మా సిఓ ఊర్మిళ, టిపిబిఓలు తదితరులు పాల్గొన్నారు.

# జి.ఎం (సేఫ్టీ)మల్లారపు మల్లయ్యకు సన్మానం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూన్ 17 : సింగరేణి సంస్థ రామగుండం రీజియన్ జనరల్ మేనేజర్ (సేఫ్టీ) మల్లారపు మల్లయ్య మొదటిసారిగా రామగుండం-2 ఏరియాకు విచ్చేసిన సందర్భంగా బుధవారం జి.ఎం.కార్యాలయంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య ఆధ్వర్యంలో ఏరియా అధికారులు మల్లయ్య ని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీ.ఎం బండి వెంకటయ్య మాట్లాడుతూ, సేఫ్టీ విభాగానికి రీజి యన్ స్థాయిలో అనుభవజ్ఞులైన మల్లయ్య సేవలు లభించడం సంతోషకరమని, ఆయన మార్గదర్శకత్వంలో ఆర్.జి-2 ఏరియాలో గనుల భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆకాంక్షించారు. జీఎం (సేఫ్టీ) మల్లారపు మల్లయ్య స్పందిస్తూ, ఆత్మీయ సన్మా నానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల భద్రతే ప్రథమ ప్రాధాన్యత అని, "జీరో యాక్సిడెంట్ లక్ష్య సాధనకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. జనరల్ మేనేజర్ బండి వెంకటయ్య హెచ్‌వోడి పర్సనల్ అధికార ప్రతినిధి ఎన్. వేణుగోపాల్ ఎజిఎం (ఐఈ) కె. చంద్రశేఖర్ ఏరియా సేఫ్టీ ఆఫీసర్ బి.వి. సత్యనారాయణ డీజీఎం (ఎఫ్ అండ్ ఎ) బి.వి.రామచంద్ర పర్చేస్ హెచ్‌వోడి విపిజె వెంకటేష్ ఎస్.ఇ (సివిల్ ) పి.బాలరాజు ఎన్విరాన్‌మెంట్ ఆఫీసర్ ఎన్. వేణుకుమార్ సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ సునీత, ఐటీ మేనేజర్ కుమారి అశ్విని, మెడికల్ సూపరింటెండెంట్ జి.వి.డి. మహీపాల్,ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ షరీఫ్ మహ్మద్, సీనియర్ అసిస్టెంట్ చిరాగ్ తదితరులు పాల్గొన్నారు

# ఏఐటియుసి నాయకులపై వ్యక్తిగత దూషణలు మానుకోవాలి



**- కవిత పార్టీ పేరుతో బురదజల్లితే ఎండగడతాం**

**- ఏఐటియుసి ఆర్జీవన్ జిఎం కమిటి సభ్యులు పి.విజయలక్ష్మి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూన్ 17 : కవిత పార్టీ పేరున కొంతమంది ఏఐటీయుసి నాయకునిపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి), ఆర్జీ వన్ జి.ఎం.కమిటి సభ్యులు పి.విజయలక్ష్మిఒక ప్రకటనలో తీవ్రంగా హెచ్చరించారు. ఏదైనా విధానపరమైన విమర్శలు చేసే స్వేచ్ఛ ఎవరికైనా ఉందని, అదే సందర్భంలో వాటికి స్పందించే హక్కు కూడా ఉంటుందని ఆమె గుర్తు చేశారు. కవిత బాయి బాట పేరున ఆమె రాజకీయాలు చెప్పుకుంటే తప్పులేదని ఆమె పేర్కొన్నారు. ఏఐటీయుసిపైన, ఎర్రజెండా పైన బురదజల్లితే ఎవరినైనా ఎండగడుతామని, అదే మా నాయకులు చేశారని ఆమె స్పష్టం చేశారు. దానికి కవితను సపోర్టు చేస్తూ ఒక మహిళ మా ఏఐటీయుసి నాయకున్ని వ్యక్తిగతంగా దూషించడం సహించరాని విషయమని, అలాంటివి మానుకుంటే మంచిదని, లేకుంటే బుద్ధి చెప్పాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. కవిత తన తండ్రితో పది సంవత్సరాల పాలనలో ఏ విధంగా సింగరేణిని దోచుకున్నదో సింగరేణి కార్మికులకు తెలియనిది కాదని, సింగరేణి క్లరికల్ రిక్రూట్‌మెంట్ కుంభకోణంలో ఎన్ని లక్షలు దోచుకున్నదో తెలియనిది కాదని ఆమె ధ్వజమెత్తారు. టీబీజీకేఎస్ యూనియన్‌కు గౌరవాధ్యక్షురాలిగా ఉండి కార్మిక హక్కులను ఏ విధంగా కాలరాసిందో మర్చిపోయి, ఇప్పుడు కార్మిక హక్కుల గురించి ఆమె మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విజయలక్ష్మి ఎద్దేవా చేశారు. ఈ విషయాలు మరచి వ్యక్తిగత దూషణలు చేస్తున్న ఆ మహిళపై మేము తిరిగి వ్యక్తిగత విమర్శలు చేస్తే ఆ మహిళ పరువు ఏమవుతుందో, దూషించిన ఆ మహిళ, ఆమెతో తిట్టించిన దొంగ కార్మిక నాయకులు ఆలోచించుకోవాలని ఆమె గుర్తు చేశారు. మహిళల పట్ల గౌరవం ఉంది కాబట్టి మేము ఆమె పరువు తీయకుండా వదిలివేస్తున్నామని, ఇలాంటి దూషణలు తిరిగి చేస్తే నేను కూడా వ్యక్తిగత పరువు తీయడానికి వెనుకాడబోమని పి.విజయలక్ష్మి హెచ్చరించారు.

# తాజ్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా పునఃప్రారంభ వేడుకలు

**సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్**





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 17 : భువనగిరి మండలం తాజ్‌పూర్ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి గ్రామ ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని తాజ్‌పూర్ గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష్ శ్రీనివాస్ అన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా సోమవారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని పచ్చతోరణాలతో అలంకరించి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. సర్పంచ్ తన సొంత నిధులతో పాఠశాలను పునరుద్ధరించడంతో పాటు పలు మౌలిక సదుపాయాలు కల్పించడంతో విద్యార్థుల చేరికలు పెరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో నూతనంగా మంజూరైన ఆర్వో ప్యూరిఫైడ్ వాటర్ ఫిల్టర్‌ను సర్పంచ్ ప్రారంభించారు. ప్రార్థన, ప్రతిజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, పాఠశాలలో డిజిటల్ తరగతులు, ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొచ్చామని, విద్యార్థులు నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సామాజికవేత్త డా. ర్యాకల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, మహ్మద్ గాలిబ్ యాకూబ్, బొమ్మారపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజ్, బీట్కూరి మహేష్, వరిగంటి మానస నాగరాజు, షేక్ అహ్మద్, ఏఏపీసీ చైర్మన్ వరిగంటి రమ్య, అంగన్వాడీ టీచర్ ఊర్మిళ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీ త్రిలింగ రాజ రాజేశ్వర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్ర శేఖర్ రెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూన్ 17 : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ జనగామలోని శ్రీ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి దేవాలయన్ని తెలంగాణ రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి , కమిషనర్లు పర్వీన్ కుమార్, భూపాల్, పి.వి.శ్రీనివాసరావు, అయోధ్య రెడ్డిలు స్వామివారిని దర్శిం చుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ తోకల శ్యామని రమేష్ లు కమిషన్ చైర్మన్ కమిషనర్లను శాలువా లతో ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామ పెద్దలు దేవాలయ విశిష్టత, చారిత్రక నేపథ్యం, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ను వారికి వివరించారు. ఆలయ చరిత్రను ఆసక్తిగా తెలుసుకున్న కమిషన్ సభ్యులు దేవాలయ అభివృద్ధిపై ప్రశంసలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రమేష్ శర్మ, గ్రామ పెద్దలు నడిపెల్లి గోపాల్ రావు, ఏలేశ్వరం శ్రీనివాస్, అరెల్ల రవితేజ, జనగామ బద్రి తదితరులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పిస్తే ఇంటి పన్ను, వాటర్ బిల్లు చెల్లిస్తా

**సర్పంచ్ కొంతం శ్రీనివాస్**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 17 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను ప్రోత్సహించేందుకు వలిగొండ మండలం ఏదుళ్లగూడెం గ్రామ సర్పంచ్ కొంతం శ్రీనివాస్ వినూత్న నిర్ణయం ప్రకటించారు. బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించే తల్లిదండ్రుల ఇంటి పన్ను, వాటర్ బిల్లులను తన సొంత నిధుల నుంచి చెల్లిస్తానని వెల్లడించారు. గ్రామంలోని ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్యను అందించుకోవాలని ఆయన కోరారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి, గ్రామ వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్ ప్రకటించిన ప్రోత్సాహక నిర్ణయాన్ని గ్రామస్థులు అభినందించారు.



# సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**- చేసిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శేరిలింగంపల్లి. జూన్ 17 : రూ.1 కోటి 88 లక్షల రూపాయ లతో మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నూతనంగా చేపట్టబోయే బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ శంఖుస్థాపన చేసారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రజయ్ షెల్టర్, జనప్రియ వెస్ట్ సిటీ, నాగార్జున ఎనక్లేవ్ కాలనీల లో నూతనంగా చేపట్టబోయే బీటీ రోడ్లు మరియు సీసీ రోడ్ల నిర్మాణం పనులకు మాజీ కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్ నార్నె శ్రీనివాసరావు తో ముఖ్యఅతిథిగా పాల్గొని శంకు స్థాపన చేసిన పీఏసీ చైర్మన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమం మరియు శేరిలింగంపల్లి నియోజకవర్గం మరియు కాలనీ ల అభివృద్దే ధ్యేయంగా ప్రజల సౌకర్యార్థం నూతనంగా చేపట్ట బోయే బీటీ రోడ్లు మరియు సీసీ రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగినది అని, శేరిలింగంపల్లి నియోజకవర్గం ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని, అదేవిధంగా మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, తెలిపారు ఈ కార్యక్రమం లో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు, కాలనీల అసోసియే షన్ సభ్యులు,మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# విద్యతోనే బంగారు భవిష్యత్తు

**- సర్పంచ్ నార్వాడే. ప్రవీణ్ కుమార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 18 : నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మండలంలోని కుస్లీ గ్రామ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అక్షరాభ్యాసం, పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్ర మంలో సర్పంచ్ ప్రవీణ్, ఉప సర్పంచ్ రాజు ముఖ్య అతిథులుగా హాజరై అక్షరాభ్యాసాన్ని ప్రారంభించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రధాన ఉపాధ్యాయులు రాజేశ్వర్ ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో కాంగ్రెస్ నాయకుల సందడి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 17 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా మంజూరైన గృహాల నిర్మాణాలు పలు ప్రాంతాల్లో పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో బీబీనగర్ మండలంలోని చిన్న రావులపల్లి గ్రామానికి చెందిన గోరుకంటి కవిత, కొనిజి గోపాల్ చారిలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి, పొట్టోల్ల శ్యామ్ గౌడ్ పాల్గొని గృహ యజమానులను అభినందిం చారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కీలకంగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు. కార్య క్రమంలో బీబీనగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సురకంటి సత్తిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గడ్డం బాలరాజ్ గౌడ్, చిన్నావులపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు సారాజి కిట్టు, మాజీ సర్పంచ్‌లు బేజం శ్రీనివాస్, బక్కన దేవదాసు, అంబేపు బాలరాజు, వార్డు సభ్యులు గుడే వెంకటేష్, బేజం శివకుమార్, మొగిలిపాక ఉప్పలమ్మ, వాడ కాల పండు, బక్కన నర్సింహా, వాడకాల భాను, అంబేత్తు భాను తదితరులు పాల్గొన్నారు.



# ఫర్టిలైజర్ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : సీసీఎస్ పోలీసులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, జూన్ 17: రైతులు నాణ్యమైన విత్తనాలు పొందేలా చూడడంతో పాటు నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు భూపాలపల్లి జిల్లా పోలీసులు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో గణపురం మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లోని స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల నిల్వలు, విక్రయాల వివరాలను పరిశీలించారు. గడువు ముగిసిన విత్తన ప్యాకెట్లు, నకిలీ విత్తనాలు లేదా విడి విత్తనాల విక్రయాలకు పాల్పడవద్దని, ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లు జారీ చేయాలని షాపు యజమానులకు సూచించారు. వ్యవసాయదారులను మోసగించే విధంగా నిబంధనలకు విరుద్ధంగా విత్తనాల విక్రయాలు నిర్వహించినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అలాగే రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, అనుమానాస్పద విత్తనాల విక్రయాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# రేపటి ట్రైపార్టైట్ సేఫ్టీ రివ్యూ సమావేశాన్ని విజయవంతం చేయాలి

## భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్–భూపాలపల్లి, జూన్ 17: సింగరేణి సంస్థలో కార్మికుల ప్రాణ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఉందని, ఈ నెల 19న నిర్వహించనున్న ఏరియా స్థాయి ట్రైపార్టైట్ సేఫ్టీ రివ్యూ సమావేశాన్ని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం జరగనున్న ట్రైపార్టైట్ సేఫ్టీ రివ్యూ సమావేశానికి సంబంధించి బుధవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీజీఎంఎస్) ఉన్నతాధికారులు సమావేశానికి హాజరుకానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను ప్రతిష్టాత్మకంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భద్రతా ప్రమాణాల అమలు, ప్రమాద నివారణ చర్యలు, గనుల్లో పని పరిస్థితులు, కార్మికులకు అందిస్తున్న భద్రతా పరికరాలు, శిక్షణ కార్యక్రమాలు, అత్యవసర స్పందన వ్యవస్థలు, భద్రతా తనిఖీల వివరాలను సమగ్రంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. భూపాలపల్లి ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో భద్రతా నిబంధనల అమలును మరోసారి సమీక్షించాలని, డీజీఎంఎస్ అధికారులు సందర్శించే ప్రాంతాల్లో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు, రికార్డుల నిర్వహణ, సూచిక బోర్డులు, రక్షణ పరికరాల వినియోగంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సింగరేణి యాజమాన్యం అమలు చేస్తున్న భద్రతా చర్యలు, ప్రమాదాల నివారణకు చేపడుతున్న ఆధునిక విధానాలు, కార్మికుల్లో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను సమావేశంలో వివరించాలని తెలిపారు. భద్రత విషయంలో కార్మిక సంఘాల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ మరింత మెరుగైన చర్యలకు ఈ సమావేశం వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. గనుల్లో చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీయవచ్చని, ప్రతి ఉద్యోగి భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జీఎం సూచించారు. సురక్షితమైన పని వాతావరణం కల్పించడం యాజమాన్యం బాధ్యత అయితే, భద్రతా నిబంధనలను అనుసరించడం ప్రతి ఉద్యోగి విధి అని చెప్పారు. "భద్రతతో కూడిన ఉత్పత్తే నిజమైన ఉత్పత్తి" అనే భావనతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. జీరో ప్రమాదాల లక్ష్య సాధనకు అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మికులు సమిష్టిగా కృషి చేయాలని, డీజీఎంఎస్ అధికారులు చేసే సూచనలు భవిష్యత్తులో భద్రతా ప్రమాణాల మెరుగుదలకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎస్వోటుజీఎం ఎస్.కవీంద్ర, ఏసీఎంవో డాక్టర్ పద్మజ, ఏజీఎం (సివిల్) రవికుమార్, కేటీకే ఓసీ–3 ప్రాజెక్టు పీఓ బిక్షమయ్య , కేటీకే ఓసీ–2 పీఓ శ్యాంసుందర్, డీజీఎం (ఎఫ్ అండ్ ఏ) పి.రాజేశ్వర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మాటూరి రవీందర్, కేటీకే–1 గ్రూప్ ఏజెంట్ ములుకుంట్ల తిరుపతి, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, వివిధ గనులు, విభాగాల అధికారులు, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ నాయకుడు హుస్సేన్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# కల్లూరు మున్సిపాలిటీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

## – అంబేద్కర్ నగర్‌లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, జూన్ 17: ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా కల్లూరు మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేసినట్లు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ తెలిపారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు మున్సిపాలిటీ 17వ వార్డు అంబేద్కర్ నగర్ ప్రాంతంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, వార్డు కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని రహదారులు, డ్రైనేజీలు, చెత్త నిల్వ ప్రాంతాలను శుభ్రపరిచి పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల వ్యాప్తి నివారణ చర్యలు చేపట్టడంతో పాటు ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రమైన వార్డు నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని, అన్ని వార్డుల్లో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు.

# యూరియా యాప్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కోరం కనకయ్య

## - పంట మార్పిడి, మిశ్రమ పంటలతో అధిక దిగుబడులు సాధించండి - రైతులకు కలెక్టర్, ఎమ్మెల్యే సూచనలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, జూన్ 17: యూరియాను మోతాదుకు మించి వినియోగించడం వల్ల భూసారం దెబ్బతిని పంట దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. రైతులు యూరియా వినియోగంలో శాస్త్రీయ పద్ధతులను పాటించడంతో పాటు పంట మార్పిడి, మిశ్రమ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. టేకులపల్లి మండల కేంద్రంలోని బేతంపూడి వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారి వి.బాబురావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి కలెక్టర్ యూరియా యాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు యూరియా కోసం గంటల తరబడి క్యూల్లో నిలబడాల్సిన అవసరం లేకుండా యాప్ ద్వారా సులభంగా యూరియా, డీఏపీ వంటి ఎరువులను బుక్ చేసుకోవచ్చన్నారు. దీంతో రైతుల సమయం ఆదా కావడంతో పాటు పారదర్శకంగా ఎరువుల పంపిణీ జరుగుతుందని తెలిపారు. యాప్ వినియోగంలో రైతులకు సహకారం అందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకున్న తొలి ముగ్గురు రైతులకు కలెక్టర్, ఎమ్మెల్యే యూరియా పంపిణీ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు మాట్లాడుతూ, ఒక ఎకరానికి రెండు బస్తాలకు మించి యూరియా వినియోగించరాదని రైతులకు సూచించారు. అధికంగా యూరియా వాడడం వల్ల భూమి సహజ సారాన్ని కోల్పోయి పంటలు చీడపీడల బారిన పడే అవకాశం ఉంటుందని వివరించారు. ప్రభుత్వం ప్రతి యూరియా బస్తాపై సుమారు రూ. 1,500 సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. పట్టాదారు పాస్‌బుక్ నంబర్ ఆధారంగా యాప్‌లో యూరియాను బుక్ చేసుకోవచ్చని, మీసేవ, నెట్ సెంటర్లతో పాటు స్మార్ట్‌ఫోన్‌ల ద్వారా కూడా ఈ సేవ అందుబాటులో ఉంటుందని చెప్పారు. పోడు భూముల రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. గతంలో ఉన్న సాంకేతిక లోపాలను సరిదిద్దుతూ నూతన యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, రైతులు యూరియా యాప్‌ను వినియోగించుకొని లబ్ధి పొందాలని కోరారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని, పంట మార్పిడి ద్వారా అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా లాభపడవచ్చని పేర్కొన్నారు. రైతులు కేవలం పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలకే పరిమితం కాకుండా మిశ్రమ పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. యూరియా కొరత వస్తుందనే అపోహతో అవసరానికి మించి నిల్వలు ఉంచుకోవద్దని, అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని కోరారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. రైతులందరికీ స్మార్ట్‌ఫోన్ వినియోగం తెలియకపోవచ్చని, గ్రామసభలు, రైతు వేదికల ద్వారా యాప్‌పై అవగాహన కల్పించి రైతులకు పూర్తి సహకారం అందించాలని వ్యవసాయ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్, జిల్లా నోడల్ అధికారి విద్యాచందన, జిల్లా సహకార అధికారి శ్రీనివాస్, కొత్తగూడెం ఆర్డీవో, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావు, ఇల్లందు మార్కెట్ యార్డు చైర్మన్ రాంబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ మంగీలాల్, స్థానిక సర్పంచ్ బోడాబాలు నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, వివిధ గ్రామాల సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

## - ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలి.
## -ఎస్.ఐ.ఆర్.పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమావేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 17: అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించే దిశగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని (ఎస్.ఐ.ఆర్.) సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసి అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ఈ నెల 25 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాలని, ఇంకా నియామకాలు పూర్తి చేయని పార్టీలు వెంటనే జాబితాలను సమర్పించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు), బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటి సర్వే ప్రక్రియలో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు మ్యాపింగ్ కాని ఓటర్ల నుంచి గుర్తింపు కోసం నిర్దేశించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒకటి సేకరించి బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. 1987కు ముందు జన్మించిన వారు తమ స్వంత ధ్రువీకరణ పత్రాలు, 1987 నుంచి 2004 మధ్య జన్మించిన వారు తమతో పాటు తల్లిదండ్రుల్లో ఒకరి ధ్రువీకరణ, 2004 తర్వాత జన్మించిన వారు తమతో పాటు తల్లిదండ్రుల లేదా తాత, నానమ్మల ధ్రువీకరణ పత్రాలను ఆధార్‌తో కలిసి సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. జూన్ 25 నుంచి బీఎల్‌వోలు, బూత్ స్థాయి ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను రెండు కాపీల్లో నింపుతారని, ఒక ప్రతిని ఓటరుకు అందజేసి, మరో ప్రతిని బీఎల్‌వో వద్ద భద్రపరుస్తారని తెలిపారు. ఇప్పటికే మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లు ఎటువంటి అదనపు పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని, మ్యాపింగ్ కాని వారు మాత్రమే నిర్దేశిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలని చెప్పారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో ప్రజలు చురుకుగా భాగస్వాములు కావాలని, ఇందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఎస్డీసీ సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డీటీ అన్సారీ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం

## "బడి బాట" కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, జూన్ 17: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూరు మండలం కందుకూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన "బడి బాట" కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. రేపటి భవిష్యత్తు ఈనాటి విద్యపై ఆధారపడి ఉంటుందని పేర్కొంటూ, విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసం, ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. గురువులు, తల్లిదండ్రులు, సమాజాన్ని గౌరవించే సంస్కారం అలవర్చుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వేంసూరు మండల ఎంఈఓ వెంకటేశ్వరరావు, కందుకూరు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ చైర్మన్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటప్ప రెడ్డి, సొసైటీ చైర్మన్ గొర్ల సంజీవ్ రెడ్డి, జిల్లా డీసీసీ కార్యదర్శి సోమిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, అట్లూరి సత్యనారాయణ రెడ్డి, బరిణిపాడు నాని, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా, యువజన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**డ్రైనేజీ పనుల పరిశీలన:** అనంతరం సత్తుపల్లి మున్సిపాలిటీ 18వ వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి, నాణ్యతతో కూడిన పనులు చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

## – జిల్లాలో 55 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యం – డీఎంహెచ్ఓ డా. బి. రవి రాథోడ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 17: జిల్లాలో జూన్ 28 నుంచి 30 వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. బి. రవి రాథోడ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై డీఎంహెచ్ఓ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రవి రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమానికి అవసరమైన వ్యాక్సిన్ నిల్వలు, కోల్డ్ చైన్ నిర్వహణ, పోలియో బూత్‌ల ఏర్పాటు, సిబ్బంది శిక్షణ, పర్యవేక్షణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, పోలియో బూత్‌లకు వ్యాక్సిన్‌ను సకాలంలో అందుబాటులో ఉంచి కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 28న జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసే పోలియో బూత్‌లలో 0 నుంచి 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. అనంతరం జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి బూత్‌ల వద్ద పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి వారికి కూడా పోలియో చుక్కలు అందజేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో సుమారు 55 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా నిర్ణయించినట్లు పేర్కొన్న డీఎంహెచ్ఓ, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా విస్తరణ, మీడియా అధికారి రాజ్‌కుమార్, ఆరోగ్య విద్యాధికారి పురుషోత్తం, సబ్ యూనిట్ అధికారి వి. శ్రీనివాస్, ఆరోగ్య సహాయకులు కె.ఎల్.ఎన్. స్వామి, ఎస్. శ్రీనివాస్, పి. లింగారెడ్డి, అనిల్, సత్యనారాయణ, ఫార్మసిస్ట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువులు, విత్తనాల విక్రయ కేంద్రాలన్నింటినీ మ్యాపింగ్ చేయాలి

## – నకిలీ విత్తనాల విక్రయదారులపై ఉక్కుపాదం మోపాలి
## – ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, జూన్ 17: జిల్లాలో ఎరువులు, విత్తనాలు విక్రయించే అన్ని దుకాణాలను మ్యాపింగ్ చేసి పటిష్ట పర్యవేక్షణలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల విక్రయాలను పూర్తిగా అరికట్టడంతో పాటు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును వేగవంతం చేయాలని సూచించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ఎరువులు, విత్తనాల విక్రయాలు, రైతు వేదికల మ్యాపింగ్, ఫార్మర్ రిజిస్ట్రీ తదితర అంశాలపై వ్యవసాయ, సహకార, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 38 రైతు వేదికల ద్వారా ఎరువులు, విత్తనాల విక్రయాలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటివరకు 15 రైతు వేదికల మ్యాపింగ్ పూర్తయిందని, మిగిలిన 23 రైతు వేదికల మ్యాపింగ్‌ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విక్రయాలు ప్రారంభించాలని ఆదేశించారు. రైతులు యాప్ ద్వారా యూరియాను బుక్ చేసుకుని పొందే విధానంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ధాన్యం సాగు విధానాలపై రైతుల్లో చైతన్యం కల్పించేందుకు డీపీఆర్వో ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. నకిలీ విత్తనాల విక్రయదారులపై అత్యంత కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా నకిలీ విత్తనాల విక్రయాలు గుర్తిస్తే వెంటనే పోలీసు కేసులు నమోదు చేసి, సంబంధిత డీలర్ల లైసెన్సులను రద్దు చేయాలని స్పష్టం చేశారు. విక్రయ కేంద్రాల వద్ద పటిష్ట పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి కేంద్రంలో మండల స్థాయి అధికారి, పోలీసు పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఎరువుల విక్రయాల ప్రక్రియ మొత్తాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్యవేక్షిస్తారని తెలిపారు. మండలాల వారీగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును సమీక్షించిన కలెక్టర్, జిల్లాలో ప్రస్తుతం నమోదు 66.77 శాతానికి మాత్రమే పరిమితమవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన నమోదును త్వరితగతిన పూర్తి చేసి లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే సాంప్రదాయ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, సహకార శాఖ అధికారి వాలియా నాయక్, వ్యవసాయ శాఖ ఏడీఏలు రమేష్, శ్రీపాల్, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూన్ 17: విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రగతికి పోషకాహారం ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. పాల్వంచ దమ్మపేట సెంటర్‌లోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, కిచెన్ షెడ్‌ను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ఆహారం ఎందుకు అందించడం లేదని ప్రధానోపాధ్యాయులను ప్రశ్నించారు. నిరంతరం పప్పు, అన్నం మాత్రమే వడ్డించడం సరైన విధానం కాదని పేర్కొంటూ, మెనూను కచ్చితంగా అమలు చేసి విద్యార్థులకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతాన్ని సమీక్షించిన కలెక్టర్, హాజరు పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలకు గైర్హాజరవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని, ప్రతి విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మెనూను కచ్చితంగా అమలు చేస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ తనిఖీలో పాల్వంచ తహసీల్దార్ ధారా ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పనుల జాప్యంపై ఎమ్మెల్యే కూనంనేని ఆగ్రహం

## – రోడ్ల ధ్వంసం, పైప్‌లైన్ లీకేజీలపై అధికారులకు చురకలు
## – యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశాలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూన్ 17: మిషన్ భగీరథ పైప్‌లైన్ పనుల జాప్యం, రోడ్ల ధ్వంసం, నీటి లీకేజీల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారుల తీరుపై కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాల్వంచ పట్టణ పరిధిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పనుల కారణంగా దెబ్బతిన్న రహదారులను బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలుచోట్ల పైప్‌లైన్ లీకేజీలు, అధ్వాన్నంగా మారిన రోడ్ల పరిస్థితిని గమనించిన ఆయన అధికారులను నిలదీశారు. ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నప్పటికీ సమస్య తీవ్రతను గుర్తించి స్పందించకపోవడం సమంజసం కాదని ఎమ్మెల్యే అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, రోడ్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు లీకేజీలను అరికట్టి తాగునీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. వారం రోజుల్లో మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల పురోగతిని సమీక్షిస్తానని, అధికారుల నిర్లక్ష్యాన్ని సహించబోనని హెచ్చరించారు. అంబేద్కర్ సెంటర్‌లో తక్షణమే సిమెంట్ రోడ్డు నిర్మించాలని, అది ప్రధాన జాతీయ రహదారికి అనుసంధానమైన ప్రాంతం కావడంతో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సంబంధిత శాఖల సమన్వయంతో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, డిప్యూటీ మేయర్ లలితకుమారి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, ఇన్‌చార్జి కమిషనర్ విజయానంద్, ఎలక్ట్రికల్ ఏడీఈ అబ్దుల్ రెహమాన్, కార్పొరేటర్లు, వివిధ శాఖల డీఈలు, ఏఈలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతాపగిరిలో ఘనంగా అమ్మ మాట-అంగన్వాడి బాట

## చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలే పునాది : సర్పంచ్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, జూన్ 17: చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, పిల్లల భవిష్యత్తుకు అంగన్వాడీ కేంద్రాలే బలమైన పునాదిగా నిలుస్తాయని ప్రతాపగిరి గ్రామ సర్పంచ్ వూర వెంకటేశ్వరరావు అన్నారు. జయశంకర్–భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని ప్రతాపగిరి గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం అంగన్వాడీ కేంద్రంలో "అమ్మ మాట -- అంగన్వాడి బాట" కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్లు బజ్జూరి జ్యోతి, గుర్రాల జ్యోతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి చిన్నారిని అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి అరికిల్ల శంకరయ్య మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి పంచాయతీ సిబ్బంది ఎల్లప్పుడూ సహకరిస్తారని తెలిపారు. కేంద్రాల నిర్వహణ, పిల్లల హాజరు శాతం పెంపు, పరిశుభ్రత వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, చిన్నారులు, గ్రామ పెద్దలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోరుట్ల మండల ఉపసర్పంచ్‌ల ఫోరం ఏర్పాటు

## అధ్యక్షుడిగా సూరినేని అరుణ్‌రావు ఏకగ్రీవ ఎన్నిక



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 17: కోరుట్ల మండల ఉపసర్పంచ్‌ల ఫోరంను బుధవారం ఏర్పాటు చేసి, మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం అధ్యక్షుడిగా గుమ్లాపూర్ గ్రామ ఉపసర్పంచ్ సూరినేని అరుణ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోరుట్ల మండలంలోని ఉపసర్పంచ్‌లు సమావేశమై ఫోరం కార్యవర్గాన్ని బుధవారం ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా ఐలాపూర్ గ్రామ ఉపసర్పంచ్ వనపర్తి సౌమ్యక్రాంతి, యూసుఫ్‌నగర్ గ్రామ ఉపసర్పంచ్ బాసవేణి రమేష్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సంగెం గ్రామ ఉపసర్పంచ్ సుధవేణి మహేష్ గౌడ్, కోశాధికారిగా జోగినిపల్లి గ్రామ ఉపసర్పంచ్ ఎల్పుల అంబేద్కర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఫోరం నాయకులు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లతో సమన్వయంగా పనిచేస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఉపసర్పంచ్‌ల పాత్రను మరింత బలోపేతం చేయడంతో పాటు, వారి న్యాయపరమైన హక్కుల సాధన కోసం ఐక్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఉపసర్పంచ్‌ల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు గ్రామ పంచాయతీల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని వారు తెలిపారు.

# ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

## – భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 17: జార్ఖండ్ రాష్ట్ర రాజధాని రాంచీలోని ఆర్ఎస్ఎస్ కార్యాలయంపై గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబులతో దాడి చేసిన ఘటనను భారత్ సురక్ష సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసీఎస్ రాజు తీవ్రంగా ఖండించారు. బుధవారం ఈ ఘటనపై స్పందించిన ఆయన, నాయకుడు చిట్ల గంగాధర్‌తో కలిసి మాట్లాడుతూ దేశభక్తి, జాతీయత భావాలతో పనిచేసే సంస్థలపై దాడులు చేయడం ఆందోళనకరమని అన్నారు. దేశ అభివృద్ధిని, జాతీయ వాద శక్తుల ఎదుగుదలను జీర్ణించుకోలేని కొన్ని శక్తులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ దేశ సేవకు అంకితమైన సంస్థ అని, దేశం లేదా సమాజానికి ఎలాంటి సమస్య ఎదురైనా ముందుండి సేవలందించే సంస్థగా పనిచేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రయోజనాల కోసం అంకితభావంతో పనిచేసే సంస్థలపై దాడులు చేయడం సమర్థనీయం కాదని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, నాయకులు సింగం గంగాధర్, వేముల పోచమల్లు, ఇల్లెందుల పురుషోత్తం, కొత్తకొండ బాలన్న, నరేంద్ర, శ్రీనివాస్, ఎడమల వెంకటరెడ్డి, బొందుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.4 లక్షలతో సర్వేపల్లి జంక్షన్ గ్రీన్‌ల్యాండ్ అభివృద్ధి పనులు

## మౌలిక వసతుల కల్పనకు చర్యలు : కౌన్సిలర్ బి. అజయ్ సారధి రెడ్డి.



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 17: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో సర్వేపల్లి జంక్షన్ వద్ద ఉన్న గ్రీన్‌ల్యాండ్ అభివృద్ధి కోసం రూ.4 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులను సీపీఐ 33వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్ సారధి రెడ్డి బుధవారం మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్‌ల్యాండ్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం, సీసీ రోడ్డు, సీసీ డ్రైనేజీ వంటి మౌలిక వసతుల పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనుల ద్వారా ప్రాంత సౌందర్యంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. వార్డు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అదేవిధంగా నూతన కూరగాయల మార్కెట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడం, వార్డులో నెలకొన్న ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని అజయ్ సారధి రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు కుమారస్వామి, శేఖర్, పెరుగు కుమార్, స్థానిక ప్రజలు అప్సర్, వెంకన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కృత్రిమ మేధస్సుతో ఉద్యోగావకాశాలు మరింత విస్తృతం

## - సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి : ప్రిన్సిపాల్ డా.కే. వెంకయ్య.




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 17: భవిష్యత్‌లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్--ఏఐ) ఆధారిత రంగాల్లో ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతాయని, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వెంకయ్య సూచించారు. అక్క–అన్న మెంటర్షిప్ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం "కృత్రిమ మేధస్సు–డిజిటల్ లెర్నింగ్" అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వెంకయ్య మాట్లాడుతూ, ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తోందని, విద్య, వైద్యం, పరిశ్రమలు, సమాచార సాంకేతిక రంగాల్లో ఏఐ వినియోగం వేగంగా విస్తరిస్తోందన్నారు. భవిష్యత్ ఉద్యోగ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ ఎస్. సందీప్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బోధనా నైపుణ్యాలను పెంపొందించడమే అక్క--అన్న మెంటర్షిప్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తమ సహచర విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడం ద్వారా వ్యక్తిత్వ వికాసం సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫ్యాకల్టీ మెంటర్లు టీ. దేవన్న, బి. రాజేందర్, ఏ. మనోజ్ కుమార్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం

## ఈ ఆహారపదార్థాలను ఎక్కువ మంట మీద వండితే క్యాన్సర్ రావడం పక్కా

చాలా మందికి ఎక్కువగా ఫ్రై అయిన ఆహారపు పదార్థాలను తినాలని ఉంటుంది. అందుకోసం ఎక్కువ మంట మీద ఆహారపదార్థాలను వండుతుంటాము. కానీ కొన్ని ఆహారపదార్థాలను ఎక్కువ మంట మీద వండకూడదు. అలా ఎక్కువ మంట మీద వండితే క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉంటాయి. అందుకే ఆ ఆహారపదార్థాలను చాలా తక్కువ వేడి మీద వండాలి. ఈ స్టోరీలో ఎక్కువగా మంట మీద వండకూడని ఆహారపదార్థాలు ఏంటి? ఆ వస్తువులు ఏవి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

బంగాళదుంపలు దుంపలలో బంగాళదుంప చాలా మందికి ఇష్టమైన కూరగాయ. ఎదో ఒక మార్గంలో ప్రతి రోజూ బంగాళాదుంపలను తీసుకుంటూ ఉంటారు. అటువంటి బంగాళదుంపలను ఎక్కువసేపు వేడి చేసినట్లయితే.. అవి క్యాన్సర్‌కు కారణమయ్యే యాక్రిలమైడ్ అనే హానికరమైన రసాయనాన్ని ఉత్పత్తి చేస్తాయి. అలాంటప్పుడు వాటిని తింటే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి బంగాళదుంపలను ఎప్పుడూ తక్కువ మంట మీద ఉడికించాలి.

గొడ్డు మాంసం గొడ్డు మాంసం చాలా మంది తినడానికి ఇష్టపడరు. కానీ దీనిని తినాలనుకునే వారు చాలా ఎక్కువ మంట మీద ఎక్కువ సమయం వేడి చేస్తుంటారు. అయితే గొడ్డు మాంసాన్ని ఎక్కువ మంట మీద వండినప్పుడు అవి క్యాన్సర్‌కు కారణమయ్యే రసాయనాలను విడుదల చేస్తుంది. అలా ఉడికించిన మాంసాన్ని తినడం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుంది.



బ్రెడ్ ప్రస్తుతం ఉన్న కాలంలో చాలా మందికి బ్రెడ్ ఒక బ్రేక్‌ఫాస్ట్. బ్రెడ్ ఎలాంటిదైనా సరే, దాన్ని అతిగా టోస్ట్ చేసినప్పుడు, అది క్యాన్సర్‌కు కారణమయ్యే యాక్రిలమైడ్ అనే రసాయనాలను ఉత్పత్తి చేస్తుంది, ఇది క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి బ్రెడ్‌ను టోస్ట్ చేసేటప్పుడు తక్కువ మంట మీద ఉంచి లైట్ గా టోస్ట్ చేయండి.

చికెన్

చికెన్ చాలా మందికి ఇష్టమైన వంటకం. రోస్ట్ చేసిన చికెన్ ఎక్కువగా తింటూ ఉంటారు. అందులో ఒకటి చికెన్ 65. ఈ చికెన్ 65 చేస్తున్నప్పుడు ఎక్కువ సేపు నూనెలో వేసి ఎక్కువసేపు వేయించినట్లయితే, అది క్యాన్సర్ కారకాలను సృష్టించి, క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి క్యాన్సర్ రాకుండా ఉండాలంటే చికెన్ ఎప్పుడూ తక్కువ వేడి మీద ఉడికించాలి.

చేప గ్రేవీలో తినడానికి ఇష్టపడే వారి కంటే చేపలను వేయించి తినడానికి ఇష్టపడే వారు ఎక్కువ. చేపలను ఇలా ఉడకబెట్టేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే చేపలను అధిక వేడి మీద ఎక్కువసేపు ఉడికించడం వల్ల క్యాన్సర్‌కు కారణమయ్యే హానికరమైన క్యాన్సర్ కారకాలు విడుదలవుతాయి. కాబట్టి వీలైనంత తక్కువ ఉష్ణోగ్రత వద్ద చేపలను ఉడికించాలి.

## మన పూర్వీకులకు కొండలను పిండి చేసే శక్తినిచ్చిన ఫుడ్ ఇదే..

మనందరికీ పులిహోర గురించి తెలిసి ఉంటది కానీ మెలహోర గురించి చాలా తక్కువ మందికి మాత్రమే తెలిసి ఉంటది. మొలహోర చాలా పాలకాలం నాటి వంట. వందల ఏళ్లుగా పండుగలు, ప్రత్యేక సందర్భాలలో దీనిని చేసుకొని తినేవాళ్లు. మన పూర్వీకులు ఆరోగ్యంగా ఉండేందుకు కారణమైన వంటల్లో ఈ మొలహోర కూడా ఒకటి. కొంచెం స్పైసీగా,కొంచెం కమ్మగా ఎంత తిన్నా ఇంకా తినాలనిపించే ఈ అద్భుతమైన పాతకాలం నాటి వంటను మీరు మీ ఇంట్లో ట్రై చేయాలనుకుంటే దీని తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

మొలహోర తయారీకి కావాల్సిన పదార్థాలు -బియ్యం -పచ్చికొబ్బరి -ఉప్పు -జీడిపప్పు -మిరియాలు -నెయ్యి -ఇంగువ

మొలహోర తయారీ విధానం -ముందుగా అన్నం వండుకోడానికి వాడే 1 కప్పు రైస్ ని అరగంట సేపు నానబెట్టండి. తర్వాత ఒక కొబ్బరి చిప్పను తీసుకొని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి మిక్సీ గిన్నెలో వేసి ఇందులోనే బియ్యం కొలిచిన కప్ తో 3 కప్పుల వేడి నీళ్లు పోసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి. -తర్వాత ఈ మిశ్రమాన్ని ఓ గిన్నెలోకి వడకట్టి తీసుకోండి. వడకట్టగా వచ్చిన కొబ్బరిపిప్పిని మళ్లీ మిక్సీ గిన్నెలో వేసి గ్రైండ్ చేసి తర్వాత దాన్ని కూడా వడకట్టుకోవాలి, -ఇప్పుడు అన్నం వండుకోడానికి గిన్నెతీసుకొని అందులో నానబెట్టిన బియ్యం, వడకట్టగా వచ్చిన కొబ్బరిపాలను 5 కప్పులను పోయాలి. ఇందులోనే రుచికి సరిపడా ఉప్పు వేసి స్టవ్ మీద పెట్టి మీడియం



మంట మీద ఉడకనివ్వాలి. -కొద్దిసేపు ఉడికి దగ్గరపడిన తర్వాత మూతపెట్టి మంటను సిమ్ లో ఉంచండి. మధ్య మధ్యలో మూత తీసి కలుపుతూ ఉడికించండి. -అన్నం కొంచెం జారుగా ఉన్నప్పుడే స్టవ్ ఆఫ్ చేసేయండి. -ఇప్పుడు 2 స్పూన్ల మిరియాలను కచ్చాపచ్చాగా దంచి పక్కనపెట్టుకోండి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి 3 స్పూన్ల నెయ్యి వేసి ఇందులోనే జీడిపప్పులు వేయించుకోండి. -జీడిపప్పులు కొద్దిగా వేగిన తర్వాత అందులో కరివేపాకు, దంచి పెట్టుకున్న మిరియాల పొడి, పావు స్పూన్ ఇంగువ వేసి కలుపుకోండి. -ఈ తాలింపుని వండిన కొబ్బరిపాల అన్నంలో వేసి మెత్తం కలిసేలా కలుపుకోండి. అంతే మొలహోర రెడీ.

## గోంగూర చికెన్ నిల్వ పచ్చడి..



**గోంగూర చికెన్ నిల్వ పచ్చడి..చూస్తే నోరూరిపోతుంది,తింటే అద్భుతంగా ఉంటుంది. దీనిని వేడి వేడి అన్నంలో వేసుకొని తింటే నా సామి రంగా మాటల్లో చెప్పలేని అనుభూతి అంతే. ముఖ్యంగా చలికాలంలో వేడి అన్నంలో ఇది కలుపుకొని తింటుంటే ఇంక ఏమైనా ఉంటుందా చెప్పండి. అయితే ఈ గోంగూర చికెన్ నిల్వ పచ్చడిని తయారు చేసుకోడానికి ఏమేం పదార్థాలు** కావాలి,తయారీ విధానం వంటి వివరాలను ఇక్కడ చూసేయండి.

గోంగూర చికెన్ నిల్వ పచ్చడి తయారీకి కావాల్సిన పదార్థాలు -అర కేజీ చికెన్ -పావు కేజీ గోంగూర -చింతపండు -జీలకర్ర -మెంతులు -ఆవాలు -ధనియాలు -దాల్చిన చెక్క -లంగం -ఆయిల్ -పసుపు -ఉప్పు -కారం -అల్లం వెల్లుల్లి పేస్ట్.

**గోంగూర చికెన్ నిల్వ పచ్చడి తయారీ విధానం:** ముందుగా ఒక గిన్నె తీసుకొని అందులో 250 గ్రాముల గొంగూర వేసి బాగా శుభ్రంగా కడగండి. -కడిగిన గోంగూరని వడగిన్నెలో వేసి నీరు అంతా పోయిన తర్వాత పొడి గుడ్డ మీద వేసి బాగా ఆరబెట్టండి. -ఆరిన గోంగూరని చిన్న ఆకులుగా కట్ చేసుకొని దాన్ని ఓ బౌల్ లో వేసి పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు ఓ చిన్న గిన్నెలో నిమ్మకాయ సైజ్ అంత చింతపండు వేసి కొంచెం వేడినీళ్లు అందులో పోసి నానబెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి పాన్ పెట్టి అర టీ గ్లాస్ వేరుశెనగ నూనె పోసి అది వేడెక్కిన తర్వాత అందులో కట్ చేసి పెట్టుకున్న గోంగూర్ మొత్తం వేసి మంటను మీడియం ఫ్లేమ్ లో పెట్టి 1-2 నిమిషాలు కలుపుతూ వేయించుకోండి. -గోంగూర బాగా వేగిన తర్వాత ముందుగా నానబెట్టుకున్న చింతపండు రసం ఇందులో వేసి కలపండి. మంటలను లో ఫ్లేమ్ లో పెట్టి ఆయిల్ సపరేట్ అయ్యేవరకు కలుపుతూ వేయించుకోండి. -ఇప్పుడు ఇందులోనే అర గ్లాస్ ఆయిల్ పోసి కలుపుతూ వేయించుకోండి. ఆయిల్ పూర్తిగా సపరేట్ అయిన తర్వాత పాన్ ని దించేసి పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద మరో బాండీ పెట్టి అందులో అర టేబుల్ స్పూన్ ధనియాలు, అర టేబుల్ స్పూన్ జీలకర్ర, అర టీ స్పూన్ మెంతులు,1 ఇంచు చెక్క, 4 లవంగ మొగ్గలు వేసి దోరగా వేయించుకోండి. తర్వాత వీటిని మిక్సీ గిన్నెలో వేసి మెత్తని పొడిగా చేసుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద పాన్ పెట్టి అందులో 1 టీ గ్లాస్ వేరుశెనగ నూనె పోసి అది వేడెక్కిన తర్వాత అందులో శుభ్రంగా కడుక్కున్న అర కేజీ బోన్ లెస్ చికెన్,అర టీ స్పూన్ పసుపు,1 టీస్పూన్ ఉప్పు వేసి చికెన్ లోని నీరు మొత్తం ఇంకిపోయి ఆయిల్ సపరేట్ అయ్యేంతవరకు మంటలను హై ఫ్లేమ్ లో పెట్టి ఉడికించుకోండి. -తర్వాత ఇందులో 2 టీ స్పూన్ల అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసుకొని అది పచ్చి వాసన పోయే వరకు వేపుకొని స్టవ్ ఆఫ్ చేసేయండి. -చికెన్ ముక్కలు చల్లారిన తర్వాత అందులో ముందుగా మిక్సీలో గ్రైండ్ చేసి ఉంచుకున్న మసాలా పొడి, 5 టేబుల్ స్పూన్ల కారం,సరిపడా ఉప్పు వేసి బాగా కలిపిన తర్వాత ఇందులోనే వేయించుకున్న గోంగూర వేసి బాగా కలపండి.గోంగూర చికెన్ నిల్వ పచ్చడి రెడీ.

## హెూటల్ స్టైల్ చికెన్ టిక్కా



వీకెండ్‌లో చాలా మంది రెస్టారెంట్లకు వెళ్ళడానికి ఇష్టపడుతుంటారు. అలా రెస్టారెంట్లకు వెళ్ళినప్పుడు చాలా మంది చికెన్ స్నాక్స్, చికెన్ స్టార్టర్స్ తినడానికి ఇష్టపడుతుంటారు. అందులో మొదటి వరుసలో ఉండేది చికెన్ టిక్కా. ఈ చికెన్ టిక్కా ఎంతో రుచికరంగా నోట్లో పెట్టుకుంటేనే కరిగిపోయే విధంగా ఉంటుంది. దీనిని మనం ఇంట్లో కూడా తయారు చేసుకోవచ్చు. చాలా సులభమైన పద్దతిలో క్షణాల్లోనే దీనిని సిద్ధం చేసుకోవచ్చు. అయితే దీనికి కావాల్సిన పదార్థాలు ఏంటి? ఏ విధంగా దీనిని చేసుకోవాలి అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

చికెన్ టిక్కా తయారీకి కావాల్సిన పదార్థాలు

బోన్‌లెస్ చికెన్ పెరుగు కారం ఉప్పు పసుపు అల్లం వెల్లుల్లి పేస్ట్ గరం మసాలా నిమ్మరసం ధనియాల పొడి కసూరి మేథీ బిర్యానీ మసాలా మిరియాల పొడి శనగ పిండి నూనె చికెన్ టిక్కా తయారీ విధానం ఈ చికెన్ టిక్కాను ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు. మ్యారినేట్ సరిగ్గా చేసుకుంటే ఇంట్లో చేసుకునే చికెన్ టిక్కా హెూటల్‌లో వాటికంటే మరింత రుచికరంగా ఉంటుంది. అలా చేసుకోవడానికి ముందుగా.. చికెన్‌ను శుభ్రంగా కడుక్కొని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. అందులో ఇప్పుడు పెరుగు, కారం, ఉప్పు, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్, గరం మసాలా, నిమ్మరసం, ధనియాల పొడి, కసూరి మేథీ, శనగ పిండి, మిరియాల పొడి, బిర్యానీ మసాలా వేసుకోవాలి. ఇప్పుడు మనం వేసుకున్న మసాలాలు అన్నీ ఆ చికెన్‌కు పట్టుకునే విధంగా బాగా కలుపుకోవాలి. ఆ మసాలాలు మొత్తం చికెన్‌కు పట్టుకోవడానికి ఒక గంట పాటు మ్యారినేట్ చేసుకున్న చికెన్‌ను పక్కన పెట్టుకోవాలి. సాధారణంగా ఈ చికెన్ టిక్కాను కట్టెల పొయ్యి మీద చేసుకుంటేనే రుచి అద్భుతంగా ఉంటుంది. వీలైతే కట్టెల పొయ్యి మీదే చేసుకోవడానికి ప్రయత్నించండి. లేని యెడల గ్యాస్‌పైన కూడా చేసుకోవచ్చు. అలా ఒక గంట పాటు మ్యారినేట్ అయిన చికెన్‌ను తీసుకొని ఇనుప చువ్వల్లో గుచ్చుకోవాలి. ఆ తరువాత బొగ్గుల మంట మీద ఆ చికెన్ ముక్కలను రెండు వైపులా బాగా కాలే విధంగా నూనె పూసుకుంటూ కాల్చుకోవాలి. రెండు వైపులా సరిగ్గా కాలే వారకు కాల్చుకోవాలి. అప్పుడే ముక్క బాగా ఉడుకుతుంది. రుచి అద్భుతంగా ఉంటుంది. గ్యాస్‌పైన చేసుకోవాలని అనుకునే వ్యక్తులు పెనం పెట్టి, కొద్దిగా ఆయిల్ రాసి, ఆ తరువాత చికెన్ ముక్కలను దానిపై ఉంచి బాగా కాల్చుకోవాలి. చికెన్ ముక్కలను కొంచెం కొంచెం నూనె రాస్తూ రెండు వైపులా బాగా కాల్చుకుంటే ఎంతో రుచికరమైన చికెన్ టిక్కా సిద్ధమైనట్లే.

# సినిమా న్యూస్



## సమంతకు మల్టీప్లెక్స్ ఓకే.. సింగిల్ స్క్రీన్స్ సంగతేంటి?



సమంత నటించిన మా ఇంటి బంగారం సినిమా జూన్ 19న థియేటర్లలో సందడి చేయబోతున్న విషయం తెలిసిందే. ఒకే రోజులో ఏకంగా నలభై ఇంటర్వ్యూలు ఇచ్చి సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడంలో ఆమె సక్సెస్ అయింది. రిలీజ్ డేట్ దగ్గర పడటంతో ఈ భారీ ప్రమోషన్స్ వల్ల అడ్వాన్స్ బుకింగ్స్ కు మంచి బజ్ క్రియేట్ అయింది. రెండు రోజుల ముందుగానే టికెట్ సేల్స్ మొదలవడంతో ప్రస్తుత ఆడియన్స్ స్పందన ఎలా ఉందో ఒక క్లారిటీ వస్తోంది. ప్రస్తుత అడ్వాన్స్ బుకింగ్స్ ట్రెండ్ చూస్తుంటే ప్రధాన నగరాల్లోని మల్టీప్లెక్స్ థియేటర్లలో సమంత క్రేజ్ బాగానే పనిచేస్తున్నట్లు అర్థమవుతోంది. మల్టీప్లెక్స్ లోని ఎర్లీ మార్నింగ్ షోలకు సంబంధించి టికెట్లు ఫాస్ట్ గా అమ్ముడవుతూ దాదాపు అన్నీ ఫుల్ బోర్డులు కనిపిస్తున్నాయి. ఒక మంచి ఫ్యామిలీ యాక్షన్ కామెడీ కథతో వస్తుండటంతో అర్బన్ ఆడియన్స్ సినిమా చూడటానికి ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. మల్టీప్లెక్స్ ప్రేక్షకులకు కావాల్సిన కంటెంట్ ఇందులో ఉందనే నమ్మకం బుకింగ్స్ చూస్తుంటే అర్థమవుతుంది. కానీ అసలు సమస్య అంతా సింగిల్ స్క్రీన్స్ దగ్గరకు వచ్చేసరికి మొదలైంది. ఇక్కడ పరిస్థితి మల్టీప్లెక్స్ కు పూర్తిగా భిన్నంగా ఉంది. మెయిన్ మాస్ సెంటర్స్ లో మా ఇంటి బంగారం సినిమాకు ఆశించిన స్థాయిలో టికెట్లు తెగడం లేదు. సింగిల్ స్క్రీన్స్ లో బుకింగ్స్ చాలా డల్ గా సాగుతున్నాయి. ప్రమోషన్స్ గట్టిగానే చేసినా మాస్ జనాలకు సినిమా ఇంకా పూర్తి స్థాయిలో కనెక్ట్ అయినట్లు లేదు. ఇక సినిమా రిలీజ్ రోజున థియేటర్లకు వచ్చి టిక్కెట్లు కొంటేనే సింగిల్ స్క్రీన్స్ పరిస్థితి మెరుగుపడుతుంది. అయితే కేవలం ఎర్లీ మార్నింగ్ షోలు ఫుల్ అయితేనే సినిమా కమర్షియల్ గా హిట్ అయినట్లు కాదు. ఉదయం ఆటలతో పాటు మధ్యాహ్నం, రాత్రి ఆటలకు కూడా మల్టీప్లెక్స్ లో కచ్చితంగా జనాలు కంటిన్యూ అవ్వాలి. మార్నింగ్ షో టాక్ మీదనే ఆ తర్వాత షోల కలెక్షన్స్ పూర్తిగా ఆధారపడి ఉంటాయి. సినిమాకు పాజిటివ్ టాక్ రాకపోతే మధ్యాహ్నం ఆటల నుంచి మల్టీప్లెక్స్ థియేటర్లలో కూడా ఆక్యుపెన్సీ డ్రాప్స్ కనిపించే ప్రమాదం ఉంది. బాక్సాఫీస్ దగ్గర సమంతకు ఇప్పుడున్న అతిపెద్ద ప్లస్ పాయింట్ ఏంటంటే ఎలాంటి గట్టి పోటీ లేకపోవడం. మరోవైపు అఖిల్ లెనిన్ సినిమా జూలై 10కి షిఫ్ట్ అవ్వడంతో మా ఇంటి బంగారం సినిమాకు ఏకంగా రెండు వారాల పాటు సోలో రన్ దొరికింది. ఫోకస్ మొత్తం సామ్ పైనే ఉంటుంది. మొదటి రోజు మౌత్ టాక్ బాగుంటే చాలు సింగిల్ స్క్రీన్స్ లో కూడా టిక్కెట్లు తెగుతాయి. రెండు వారాల ఫ్రీ విండోలో ఈ సినిమా ఈజీగా బ్రేక్ ఈవెన్ దాటి లాభాలు దక్కించుకునే అవకాశం ఉంది. ఏ సినిమాకైనా బడ్జెట్ తిరిగి రావాలంటే కేవలం ఒక వర్గం ఆడియన్స్ చూస్తే ఏమాత్రం సరిపోదు. ప్రమోషన్స్ తో మల్టీప్లెక్స్ ఆడియన్స్ ను లాగడంలో సక్సెస్ అయినా లాంగ్ రన్ లో సింగిల్ స్క్రీన్స్ కూడా కచ్చితంగా నిలబడాలి. కంటెంట్ లో దమ్ముంటే బి సి సెంటర్స్ జనాలకు కూడా ఈ ఫ్యామిలీ కామెడీ కనెక్ట్ అవుతుంది. ప్రమోషన్స్ కష్టం కలెక్షన్స్ గా మారుతుందా లేదా అనేది శుక్రవారం నాడు వచ్చే పబ్లిక్ టాక్ తో తేలిపోనుంది.

## గ్లామర్ వర్కౌట్ కాలేదా.. బుకింగ్స్ ఎందుకింత డల్?

నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటించిన లేటెస్ట్ బాలీవుడ్ మూవీ కాక్టెయిల్ 2 జూన్ 19న థియేటర్లలోకి వస్తోంది. 2012లో వచ్చిన సూపర్ హిట్ కాక్టెయిల్ సినిమాకు సీక్వెల్ గా హోమి అదజానియా ఈ రొమాంటిక్ కామెడీని తెరకెక్కించారు. షాహిద్ కపూర్, కృతి సనన్ లతో పాటు రష్మిక ఇందులో మెయిన్ లీడ్ లో నటించింది. ఇక కాంబినేషన్ కు నార్త్ లో క్రేజ్ ఉన్నప్పటికీ ఇక్కడ సీన్ వేరేలా ఉంది. ఈ సినిమాకు సంబంధించి మన రెండు తెలుగు రాష్ట్రాల్లో అడ్వాన్స్ బుకింగ్స్ చూస్తుంటే ట్రేడ్ వర్గాలకు దిమ్మతిరిగిపోతోంది. హైదరాబాద్ లాంటి మెగా సిటీలోనే ఈ సినిమాకు టికెట్ సేల్స్ చాలా ఘోరంగా ఉన్నాయి. ఒక్కో స్క్రీన్ కి కనీసం 10 నుంచి 15 టికెట్లు కూడా తెగడం లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. విజయవాడ, వైజాగ్ లాంటి మేజర్ సెంటర్స్ లో కూడా ఈ సినిమాను పట్టించుకునే జనమే కరువయ్యారు. వైజాగ్ లో నార్త్ ఇండియన్ పబ్లిక్ ఎక్కువగా ఉన్నప్పటికీఅక్కడ కూడా థియేటర్ల దగ్గర ఎలాంటి బజ్ కనిపించడం లేదు. నిజానికి ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్-యూ సర్టిఫికేట్ ఇచ్చింది. రష్మిక, కృతి సనన్ ల గ్లామర్ షోతో పాటు లిప్ లాక్స్, డబుల్ మీనింగ్ లాంటి 18ం కంటెంట్ ఇందులో గట్టిగానే ఉంది. అసలైతే ఇలాంటి బోల్డ్ ఎలిమెంట్స్ ఉన్న సినిమాలకు యూత్ లో గట్టి క్రేజ్ ఉంటుంది. కానీ కాక్టెయిల్ 2 విషయంలో ఆ బోల్డ్ నెస్ ఏదీ ఆడియన్స్ ను థియేటర్లకు లాగలేకపోతోంది. ఇక గ్లామర్ ఉంటే సరిపోదు సరైన రీచ్ కూడా ఉండాలని ఈ అర్థమవుతుంది. ఈ రేంజ్ లో బుకింగ్స్ డ్రాప్ అవ్వడానికి



మెయిన్ రీజన్ ప్రమోషన్స్ సరిగ్గా చేయకపోవడమే. బాలీవుడ్ మేకర్స్ ఈ సినిమాను సౌత్ మార్కెట్ లో ప్రమోట్ చేయడాన్ని చాలా లైట్ తీసుకున్నారు. రష్మిక లాంటి స్టార్ హీరోయిన్ ఉన్నా కూడా మన దగ్గర కనీస స్థాయిలో ఈవెంట్స్ ప్లాన్ చేయలేదు. షాహిద్ కపూర్, రష్మిక కపుల్‌గా నటిస్తున్న ఈ మోడరన్ లవ్ ట్రయాంగిల్ స్టోరీ గురించి చాలామందికి ఇంకాక్లారిటీనే లేదు. ఇక గ్లామర్ ఉంటే సరిపోదు సరైన రీచ్ కూడా ఉండాలని ఈ అర్థమవుతుంది. ఈ రేంజ్ లో బుకింగ్స్ డ్రాప్ అవ్వడానికి మెయిన్ రీజన్ ప్రమోషన్స్ సరిగ్గా చేయకపోవడమే. బాలీవుడ్ మేకర్స్ ఈ సినిమాను సౌత్ మార్కెట్ లో ప్రమోట్ చేయడాన్ని చాలా లైట్ తీసుకున్నారు. రష్మిక లాంటి స్టార్ హీరోయిన్ ఉన్నా కూడా మన దగ్గర కనీస స్థాయిలో ఈవెంట్స్ ప్లాన్ చేయలేదు. షాహిద్ కపూర్, రష్మిక కపుల్ గా నటిస్తున్న ఈ మోడరన్ లవ్ ట్రయాంగిల్ స్టోరీ గురించిచాలా మందికి ఇంకా క్లారిటీనే లేదు.

## యూనిఫాం నుంచి గ్లామర్ వరకూ..
## ఎయిర్‌హోస్టెస్‌లుగా చేసి హీరోయిన్ గా గుర్తింపు..



ఆకాశంలో విమానాల్లో ప్రయాణికులకు సేవలు అందించే ఎయిర్‌హోస్టెస్ ఉద్యోగాన్ని వదిలేసి, వెండితెరపై హీరోయిన్లుగా మెరిసిపోవడం అంటే మామూలు విషయం కాదు. తాజాగా వడ్డే నవీన్ 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హీరోయిన్ రాశీ సింగ్ ఎయిర్‌హోస్టెస్ స్టైల్‌లో స్పీచ్ ఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. నటి కాకముందు ఆమె ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేశారు. ఆమెలాగే గ్లామర్ ప్రపంచంలోకి ఎంట్రీ ఇచ్చి సక్సెస్ అయిన మరికొందరు ముద్దుగుమ్మల క్రేజీ జర్నీ మీకోసం..ఎయిర్‌హోస్టెస్ టు హీరోయిన్.. రాశీ సింగ్: రాయ్‌పూర్‌కు చెందిన రాశీ సింగ్ నటి అవ్వకముందు ప్రముఖ 'ఇండిగో' ఎయిర్‌లైన్స్‌లో ఎయిర్‌హోస్టెస్‌గా వర్క్ చేశారు. ఆ తర్వాత 2019లో 'జెమ్' అనే సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమయ్యారు. తాజాగా జరిగిన తన కొత్త సినిమా ఈవెంట్‌లో ఆమె ఎయిర్‌హోస్టెస్ స్టైల్‌లో అనౌన్స్‌మెంట్ చేస్తూ స్పీచ్ ఇచ్చి అందరిని అలరించారు. కింగ్‌ఫిషర్ నుంచి టాలీవుడ్ దాకా.. వాణీ భోజన్: సౌత్ ఇండియాలో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి వాణీ భోజన్ కూడా ఒకప్పుడు ఎయిర్‌హోస్టెస్‌గా చేశారు. ఆమె 'కింగ్‌ఫిషర్', 'ఇండిగో' లాంటి టాప్ ఎయిర్‌లైన్స్‌లో పనిచేశారు. ఆ తర్వాత ఆ జాబ్ వదిలేసి మోడలింగ్‌లోకి వచ్చారు. ఇక తెలుగులో విజయ్ దేవరకొండ ప్రొడక్షన్‌లో వచ్చిన 'మీకు మాత్రమే చెప్తా' సినిమాతో పాటు తమిళంలో 'ఓ మై కడవులే' లాంటి సూపర్ హిట్ సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. షారుఖ్ ఖాన్ మూవీ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన విద్యా మాల్వాడే, సినిమాల్లోకి రాకముందు ఎయిర్‌హోస్టెస్‌గా పనిచేశారు. తర్వాత మోడలింగ్‌పై ఆసక్తితో గ్లామర్ రంగంలోకి అడుగుపెట్టారు. షారుక్ నటించిన చక్ దే ఇండియా హాకీ టీమ్ కెప్టెన్‌గా నటించి దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అనంతరం పలు బాలీవుడ్ సినిమాల్లో నటించారు. పంజాబీ ఇండస్ట్రీ క్వీన్.. సోనమ్ బజ్వా: ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న సోనమ్ బజ్వా కూడా మొదట్లో ఎయిర్‌హోస్టెస్‌గా కెరీర్ ప్రారంభించారు. ఆ తర్వాత మోడలింగ్ వైపు అడుగులు వేసి హీరోయిన్‌గా మారారు. పంజాబీ సినీ ఇండస్ట్రీలో 'పంజాబ్ ఎల్ఓఎల్', 'అర్దబ్ ముతియారన్' వంటి సినిమాలతో టాప్ స్టార్‌గా ఎదిగారు. టాలీవుడ్‌లో కూడా 'ఆటాడుకుందాం రా' సినిమాలో ఒక స్పెషల్ సాంగ్‌లో మెరిశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నుంచి స్టార్ హీరోయిన్‌గా.. తాప్సీ పన్ను: వీరంతా ఎయిర్‌హోస్టెస్ బ్యాక్‌గ్రౌండ్ నుంచి వస్తే.. టాలీవుడ్, బాలీవుడ్ స్టార్ హీరోయిన్ తాప్సీ పన్ను మాత్రం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉండేవారు. చదువు పూర్తి కాగానే ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సంపాదించారు. కానీ ప్యాషన్ కోసం ఆ జాబ్ వదిలేసి మోడలింగ్, ఆపై సినిమాల్లోకి వచ్చారు. తెలుగులో 'ఝుమ్మంది నాదం'తో కెరీర్ స్టార్ట్ చేసి, బాలీవుడ్‌లో 'పింక్', 'థప్పడ్' వంటి లేడీ ఓరియెంటెడ్ సినిమాలతో స్టార్ డమ్ తెచ్చుకున్నారు. ఒక వైపు ఎయిర్‌హోస్టెస్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల లాంటి ప్రొఫెషనల్ లైఫ్‌ను లీడ్ చేస్తూనే.. తమ మనసుకు నచ్చిన గ్లామర్ ప్రపంచంలోకి అడుగుపెట్టి ఈ భామలు అద్భుతాలు సృష్టించారు. కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కష్టపడితే ఏ రంగంలోనైనా సక్సెస్ సాధించవచ్చని ఈ హీరోయిన్లు నిరూపించారు.

## ఫేడౌట్ అనుకుంటే బౌన్స్ బ్యాక్.. నివేదా క్రేజీ లైనప్

టాలీవుడ్ లో హీరోయిన్ల కెరీర్ గ్రాఫ్ ఎప్పుడు ఎలా మారుతుందో అంచనా వేయడం చాలా కష్టం. ఒకట్రెండు ఫ్లాపులు పడినా లేదా కాస్త గ్యాప్ వచ్చినా ఇక ఫేడౌట్ అయిపోయారని ఈజీగా డిసైడ్ చేసేస్తారు. టాలెంటెడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ విషయంలో కూడా రీసెంట్ గా ఇలాంటి కామెంట్స్ గట్టిగానే వినిపించాయి. తెలుగులో ఆమెకు అవకాశాలు దాదాపు తగ్గిపోయాయనే టాక్ నడుస్తున్న టైమ్ లో.. సడెన్ గా రెండు భారీ ప్రాజెక్ట్స్ లైన్ లో పెట్టి ఇండస్ట్రీకి పెద్ద షాక్ ఇచ్చింది. గతంలో మెంటల్ మదిలో, చిత్రలహరి, బ్రోచేవారెవరురా, అల వైకుంఠపురములో లాంటి సక్సెస్ ఫుల్ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నివేదా పేతురాజ్ కు ఆ తర్వాత ఆశించిన స్థాయిలో సరైన బ్రేక్ రాలేదు. ఆమె కెరీర్ పూర్తిగా స్లో అయిపోయినట్లే అనిపించింది. రీసెంట్ గా వచ్చిన సింగ్ గీతం సినిమాలో కూడా ఆమె కేవలం ఒక చిన్న క్యామియో రోల్ కే పరిమితం అయింది. దీంతో ఆల్మోస్ట్ ఆమె కెరీర్ గ్రాఫ్ పడిపోయిందా అనేలా కామెంట్స్ వచ్చాయి. కానీ ఆమె ప్లానింగ్ వేరేలా ఉంది. విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో రాబోతున్న ఆదర్శ కుటుంబం సినిమాలో నివేదా ఒక క్రేజీ ఛాన్స్ దక్కించుకుని అందరి దృష్టి తనవైపు తిప్పుకుంది. త్రివిక్రమ్ సినిమాల్లో లేడీ క్యారెక్టర్స్ కు ఎంత ఇంపార్టెన్స్ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ ప్రాజెక్ట్ లో ఆమె రోల్ చాలా పవర్ ఫుల్‌గా, సెకండ్ హాఫ్ లో కథను మలుపు తిప్పేలా ఉండబోతోందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా ఆఫర్ ఆమె కెరీర్ కు ఒక పెద్ద బూస్ట్ లాంటిది. వెంకటేష్ సినిమా ఛాన్స్ తోనే ఫ్యాన్స్ కు సర్ ప్రైజ్ ఇచ్చిన నివేదా.. ఇప్పుడు ఏకంగా మరో మెగా ఆఫర్ కూడా తన ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న మెగా158 ప్రాజెక్ట్ లో ఒక ముఖ్యమైన పాత్రకు ఎంపికైనట్లు తెలుస్తోంది. చిరంజీవి, యంగ్ హీరోయిన్ అనస్వర రాజన్ తండ్రీకూతుళ్లుగా నటిస్తున్న ఈ ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాలో నివేదాకు ఒక మంచి రోల్ దొరకడం నిజంగా ఆమె లక్ అనే చెప్పాలి. ఒకప్పుడు ఆఫర్స్ తగ్గినప్పుడు ఏది పడితే అది చేసుకుంటూ పోకుండా కాస్త గ్యాప్ తీసుకుని మంచి కంటెంట్ ఉన్న సినిమాల కోసం వెయిట్ చేయడం నివేదాకు ఇప్పుడు బాగా కలిసొచ్చింది. అనవసరమైన హడావుడి లేకుండా సైలెంట్ గా తన యాక్టింగ్ టాలెంట్ నే నమ్ముకుని ముందుకు వెళ్తోంది. మేకర్స్ కూడా ఆమె స్కిల్స్ మీద ఉన్న నమ్మకంతోనే ఇలాంటి బడా ప్రాజెక్ట్స్ లో కీలకమైన రోల్స్ కు ఆమె పేరును ఫైనల్ చేస్తూ అవకాశం ఇస్తున్నారు. ఇదొక పాజిటివ్ సైన్ అని చెప్పవచ్చు. ఈ రెండు భారీ ప్రాజెక్ట్స్ తో నివేదా పేతురాజ్ మార్కెట్ వాల్యూ కూడా టాలీవుడ్ లో అమాంతం పెరిగిపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఒక పక్క త్రివిక్రమ్ మార్క్ కమర్షియల్ ఎంటర్టైనర్, మరో పక్క చిరంజీవి లాంటి బిగ్గెస్ట్ స్టార్ హీరో సినిమా.. ఈ రెండు థియేటర్లలో హిట్ అయితే ఆమె కెరీర్ కంప్లీట్ గా టర్న్ తీసుకుంటుంది.



# కాకతీయ వర్సిటీ ప్రొఫెసర్ సురేష్‌లాల్ పుస్తకం

## 'వరల్డ్ ఆఫ్ ఫైవ్ జీరోస్' ఢిల్లీలో ఆవిష్కరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హనుమకొండ, జూన్17 : కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్థికశాస్త్ర విభాగాధిపతి, పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్ రచించిన 'వరల్డ్ ఆఫ్ ఫైవ్ జీరోస్' పుస్తకాన్ని బుధవారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ ఆచార్య ఎస్.మహేంద్రదేవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేంద్ర దేవ్ మాట్లాడుతూ పేదరికం, నిరుద్యోగం, అసమానత లు, నికర కార్బన్ ఉద్గారాలు, సంఘర్షణలులేని సమాజ నిర్మాణానికి ఈ పుస్తకం దార్శనికతతో కూడిన ఆచరణాత్మక మార్గదర్శకాన్ని అందిస్తుందని తెలిపారు. పుస్తక రచయిత సురేష్‌లాల్ మాట్లాడుతూ సున్నా పేదరికం, నిరుద్యోగం, అసమానత, నికర కార్బన్ ఉద్గారాలు, సంఘర్షణ అనే ఐదు ప్రధాన లక్ష్యాల ఆధారంగా మానవ సంక్షేమం, సామాజిక న్యాయం, సుస్థిర అభివృద్ధి, ప్రపంచ శాంతి సాధనకు అవసరమైన విధానాలను ఈ గ్రంథంలో ప్రతిపాదించినట్లు తెలిపారు. కేస్ స్టడీలు, నిపుణుల విశ్లేషణలు, కార్యాచరణ వ్యూహాల ద్వారా ఈ లక్ష్యాల పరస్పర అనుసంధానాన్ని వివరించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ చేతన్ గాటే, ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.డి.ఎన్. భాజ్‌పాయ్, జనరల్ సెక్రటరీ రవీంద్ర బ్రహ్మే, ప్రముఖ ఆర్థికవేత్త అశ్విని మహాజన్ పాల్గొని సురేష్‌లాల్‌ను అభినందించారు.

# హార్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

మొదటిపేజీ తరువాయి

వివిధ సముద్రాల్లో విధుల్లో ఉన్నారు. ఇది చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను? ఒప్పందంలో నావికుల భద్రతకు భరోసా లభిస్తుందని.. వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని నాకు నమ్మకం ఉందని అన్నారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. 'ఫ్రాన్స్‌లో మాకు కొన్ని అద్భుతమైన సమావేశాలు జరిగాయి. ముఖ్యంగా భారత ప్రధాని మోదీతో చాలా మంచి చర్చలు జరిగాయి. మేము వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాం. అమెరికా-భారతదేశం మధ్య చాలా విషయాలు జరుగుతున్నాయి. అమెరికా అత్యుత్తమ స్థితిలో ఉంది. మా ఆర్థిక వ్యవస్థ 19.2 ట్రిలియన్ డాలర్లకు పైగా స్థాయికి చేరుకుంది.

# రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

మొదటిపేజీ తరువాయి

జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతు కమిషన్ తెలిపింది. మేలుజాతి వంగడాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ సూచించింది. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగు విస్తరణ లక్ష్యమని పేర్కొంది. ఎఫ్‌సీఐ కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది. రైతాంగాన్ని అదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలి.. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి అనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళుతోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చర్చించింది. బిపిటి 5204, తెలంగాణ సోనా జై శ్రీరామ్, హెచ్‌ఎంటీ రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆయా పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉండడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. మేలుజాతి వంగడాలు సమృద్ధిగా ఉన్నాయని.. కాబట్టి వీటిని సాగు చేస్తే రైతులకు ఆదాయం గణనీయంగా ఉంటుదని వ్యవసాయ కమిషన్ తెలిపింది. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కమిషన్ తెలిపింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోళ్ళకు తగ్గిస్తూ మనల్ని ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ కమిషన్ తెలిపింది. అంతేకాక బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది. సమావేశంలో రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, సీడ్ కార్పోరేషన్ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆరుట్లలో సరదాగా గడిపిన సిఎం రేవంత్

మొదటిపేజీ తరువాయి

అనంతరం టీపీఎస్‌ను ప్రారంభించి.. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో మాట్లాడారు. ప్రీ-ప్రైమరీ విభాగాలను సందర్శించారు. పాఠశాల లైబ్రరీ, తరగతి గదులు, ఇన్నోవేషన్ ల్యాబ్, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ల్యాబ్స్‌ను సందర్శిం చిన సీఎం.. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనం తరం తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సీఎం మొక్క నాటారు. డ్యాన్స్, మ్యూజిక్ రూమ్‌ను సందర్శించారు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. కిచెన్‌ను సందర్శించి పూరీలు చేశారు. మొత్తంగా సరదాగా గడిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆరుట్లలో బహిరంగ సభను ఏర్పాటు చేయగా.. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.







# ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

మొదటిపేజీ తరువాయి

మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విద్యా నమూనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖ కోసం రూ.8,500 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహలు పేద ప్రజల్లో ఉన్నాయని, ఆ నమ్మకాన్ని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని సీఎం వివరించారు. విద్యా కమిషన్ వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలను సందర్శించి రూపొందించిన నివేదిక ఆధారంగానే ఈ కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది' అనే భావనను స్ఫూర్తిగా తీసుకుని విద్యా రంగంలో మార్పులు తీసుకొస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని, అందుకే విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని సీఎం తెలిపారు. భారీగా దరఖాస్తులు రావడంతో అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ విజయానికి అక్కడి ఉపాధ్యాయుల కృషే కారణమని, వారు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తాను కూడా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆరో తరగతి చదవడానికి రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడినని చెప్పారు. తమ కుటుంబం ఆర్థికంగా బాగానే ఉన్నప్పటికీ చదువుకున్నవారు లేరని, 17 ఏళ్ల వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. దేశ ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు సహా ఎన్నో ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు. సమాజంలో కులాల మధ్య గోడలు నిర్మిస్తున్నారని, ఆ గోడలను కూల్చాలనే ఉద్దేశంతో అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. విద్య ద్వారా సమానత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోతోందని అన్నారు. ఇటీవల దక్షిణ కొరియాను సందర్శించి అక్కడి క్రీడా విధానాలను అధ్యయనం చేశానని చెప్పారు. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులను తయారుచేయాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థంతో కొందరు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ కిట్లు అందించేందుకు పారదర్శకంగా టెండర్లు నిర్వహించినప్పటికీ.. కొందరు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ సమక్షంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సంక్షేమం లేదు.. అంతా సంక్షోభమే

మొదటిపేజీ తరువాయి

సూచించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సభా వేదికపై ప్రదర్శించారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశర చేశారు. డిజిటల్ సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చిన యువ నేత కేటీఆర్ కు అటు హెల్ప్ వద్ద ఇటు సభా ప్రాంగణం వద్ద కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, మరికంటి ధనలక్ష్మి, పాలేరు నియోజకవర్గ నాలుగు మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషపోయిన వీరన్న, పున్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య పాల్గొన్నారు

# మైనర్ బాలికపై అత్యాచారం..హత్య

మొదటిపేజీ తరువాయి

సంచలన తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం శ్రీరాముల పల్లి గ్రామానికి చెందిన బండపల్లి నవీన్ కుమార్‌కు చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికతో పరిచ యం ఏర్పడింది. 2019 మార్చి 13న బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో చందుర్తి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం 2020 డిసెంబర్ 4న నిందితుడు బాలికను ఆమె ఇంటి నుంచి అపహరించి గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారం చేసిన అనంతరం జరిగిన విషయాన్ని బయటపెడుతుందనే భయంతో బాలికకు విషం తాగించి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను నిందితుడు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన ప్పటికీ చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు హత్య, అత్యాచారం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్షుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు, ఇతర శాస్త్రీయ ఆధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ రెండు కేసులు సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టులో విచారణకు వచ్చాయి. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై నేరాలు రుజువైనట్లు నిర్ధారించింది. దీంతో పోక్సో కేసులో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.7,000 జరిమానా, హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసుల్లో నిందితుడికి శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి డీఎస్పీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, కోర్టు కానిస్టేబుళ్లు మహేందర్, లతీఫ్, నవీన్, వెన్నెలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అభినందించారు.

# నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

## - రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా బస్సు ప్రయాణం

## - రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూన్ 17 : ఈ నెల 21న నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపించి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చన్నారు. రవాణా కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. బుధవారం మంత్రులు లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ మానకొండూరు మండలం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల సంఖ్య పెంచామని, ఆర్టీసీ కార్మికులకు అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం వివరించారు. ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసేందుకు ఆర్టీసీ బస్సులకు యజమాను లను చేశామని గుర్తు చేశారు. ఆర్టీసీలో మరిన్ని సేవలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈనెల 21న జరిగే నీట్ పరీక్షలకు ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.

# కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రిలో దారుణం

మొదటిపేజీ తరువాయి

అక్కడ ఉన్న నర్స్ సాధారణ ప్రసవం చేసింది. కానీ కాన్పు తర్వాత శిశువు అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఇది గమనించిన కుటుంబసభ్యులు ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నవజాత శిశువును పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లుగా తెలిపారు. మరోవైపు కాన్పు అనంతరం తల్లికి తీవ్ర రక్తస్రావం కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స పొందుతూ ఆమె కూడా మరణించింది. ఈ ఘటనపై బాధిత కుటుంబం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమ కుమార్తె, మనమడు ప్రాణా లు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

# రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి

పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్దిదారుడే ఇంటి నిర్మాణ దారడని తెలిపారు. బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీ ప్లస్ 1 నిర్మాణాలకు అను మతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

# 2వేల కోట్ల బడ్జెట్ లేకుండా అంత స్కామ్ సాధ్యమా

మొదటిపేజీ తరువాయి

అసత్యమని, వాటిని నిరూపిస్తే ప్రభుత్వం దేనికైనా సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ లబ్ది కోసం నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. బలహీన వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, అలాంటి వర్గాలను మాటలతో కించపరచే ప్రయత్నాలు చేయొద్దని హితవు పలికారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే లక్ష్యంతోనే సర్ ప్రక్రియను తీసుకొచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.

# ఇరాన్ యుద్ధంతో ఇంధన సంక్షోభంలో ప్రపంచం

మొదటిపేజీ తరువాయి

చిక్కుకు పోయాయి. దీనిని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనకబడిన దేశాలను వాటిమానాన వాటిని వదిలేయొద్దని, వాటికి సహకరించేందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతోన్న దేశాలు ఈ షాక్‌లను తట్టుకొనేలా వ్యవస్థలు ఉండాలన్నారు. ఆయా దేశాల్లో ఉన్న మానవ వనరులను ప్రపంచ అభివృద్ధి భాగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సు నేపథ్యంలో ఇంతకుముందు మోదీ మాట్లాడుతూ.. ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ, ఆర్థిక భద్రత వంటి రంగాలు పెనవేసుకున్న ఈ ప్రపంచంలో.. మానవాళి పురోగతి, శ్రేయస్సు కోసం అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మించడం అత్యవసరమని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ సదస్సుకు ఫ్రాన్స్ ఆతిథ్యం ఇస్తోంది. ఆ దేశ ఆహ్వానం మేరకు మన ప్రధాని అక్కడకు వెళ్లారు. జీ-7లో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకే, యూఎస్ఏ సభ్య దేశాలు. ఐరోపా యూనియన్ కూడా ఈ సదస్సుకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

# ప్రశాంత వాతావరణంలో రెండో రోజు టీజీ టెట్ పరీక్షలు

## - అన్ని ఏర్పాట్లతో సజావుగా నిర్వహణ : జిల్లా కలెక్టర్ అంకిత్.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 17: టీజీ టెట్ జూన్-2026 పరీక్షల రెండో రోజు పరీక్షలు జిల్లాలో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించినట్లు భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన వుడుదల చేశారు. బుధవారం నిర్వహించిన పరీక్షలకు సంబంధించి పాల్వంచలోని అనూబోస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరీక్షా కేంద్రంలో ఉదయం సెషన్‌కు 67మంది అభ్యర్థులకు గాను45 మంది హాజరుకాగా, మధ్యాహ్నం సెషన్‌లో 145 మంది అభ్యర్థులకుగాను 134 మంది హాజరైనట్లు కలెక్టర్ వెల్లడించారు. పరీక్షల నిర్వహణ కోసం కేంద్రాల్లో అవసరమైన అన్నిసౌకర్యాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టడంతోపాటు భద్రత,తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచినట్లుపేర్కొన్నారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహిస్తూ పరీక్షల నిర్వహణను ఎప్పటికప్పుడు సమీక్షించారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్షలను సజావుగా నిర్వహించినట్లు కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ఎర్రంరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 17: మహబూబాబాద్ జిల్లా పర్వతగిరి గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సతీమణి ఎర్రంరెడ్డి లక్ష్మి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎర్రంరెడ్డి కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన బానోత్ శంకర్ నాయక్, లక్ష్మి మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. అలాగే, మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ నాయక్, ఇందిరానగర్ కాలనీ సర్పంచ్ షరీఫ్, మాజీ సర్పంచ్‌లు మల్సూర్, శ్యామ్, సలీం, కొంచెర్ల అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారం కోరుతూ రోడెక్కిన సింగరేణి అధికారులు

## - ఆర్జీవన్ జీఎం కార్యాలయం వరకు భారీ నిరసన ర్యాలీ - స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిక






(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని, జూన్ 17 : తమ దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి అధికారులు బుధవారం సాయంత్రం గోదావరిఖనిలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్ నుంచి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ కార్యాలయం వరకు చేపట్టిన ఈ ర్యాలీలో వివిధ ఏరియాలకు చెందిన అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు మాట్లాడుతూ, గత రెండున్నర సంవత్సరాలుగా అధికారుల సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలను పలుమార్లు కలిసి విజ్ఞప్తులు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన అధికారుల సమస్యల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం రెండు సంవత్సరాలుగా నిరీక్షించినప్పటికీ స్పందన లేకపోవడంతోనే రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సాధారణంగా అధికారులు ఆందోళనలకు దూరంగా ఉంటారని, అయితే పరిస్థితులు వారిని నిరసన బాట పట్టేలా చేశాయని పేర్కొన్నారు. సంస్థలో దాదాపు 90 శాతం మంది అధికారులు ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతున్నారని, ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని హెచ్చరించారు. యాజమాన్యం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

**పీఆర్‌పీ అమలులో జాప్యంపై ఆగ్రహం:** రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్‌పీ (పర్‌ఫార్మెన్స్ రిలేటెడ్ పే) అమలు విషయంలో ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తున్నాయని నాయకులు విమర్శించారు. ఉద్యోగులు జీతభత్యాల కోసం పనిచేస్తారని, అందులో భాగమైన పీఆర్‌పీని ఇంతకాలం పెండింగ్‌లో ఉంచడం న్యాయసమ్మతం కాదన్నారు. అలాగే కోల్ ఇండియాలో 2017 వేతన సవరణలో జరిగిన అసమానతలను ఇటీవల సరిదిద్దినా, అదే విధానాన్ని సింగరేణిలో అమలు చేస్తామని గతంలో ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేర్చలేదని ఆరోపించారు. 1974లో సింగరేణి బోర్డు ఆమోదించిన విధంగా కోల్ ఇండియాలో అమలయ్యే వేతన, సేవా ప్రయోజనాలను సింగరేణిలో కూడా అమలు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం వల్ల అధికారులు నష్టపోతున్నారని పేర్కొన్నారు.

**సీఎంఓలో ఫైల్ పెండింగ్:** పీఆర్‌పీకి సంబంధించిన ఫైలు దాదాపు ఆరు నెలలుగా ముఖ్యమంత్రి కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని, దానిపై ఎలాంటి పురోగతి కనిపించడం లేదని నాయకులు తెలిపారు. ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే జోక్యం చేసుకొని అధికారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

**దశలవారీ ఆందోళనలకు సిద్ధం:** ప్రస్తుతం గోదావరిఖనిలో ప్రారంభమైన నిరసన కార్యక్రమాలను ఈ నెల 19న శ్రీరాంపూర్ ప్రాంతంలో, అనంతరం కొత్తగూడెం ప్రాంతంలో కూడా నిర్వహించనున్నట్లు నాయకులు ప్రకటించారు. అవసరమైతే రిలే నిరాహార దీక్షలు, వర్క్ టు రూల్, సమ్మె వంటి కార్యక్రమాలకు కూడా సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ నిరసన ర్యాలీలో ఆర్జీవన్, ఆర్జీ-2, ఆర్జీ-3, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి తదితర సింగరేణి ఏరియాలకు చెందిన అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు.

# మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం

## - పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి : ఎస్పీ రోహిత్ రాజు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 17 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్మడ్ రిజర్వ్ (ఏఆర్) విభాగంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఇటీవల మరణించిన హెడ్ కానిస్టేబుల్ రాజ్ మహమూద్ కుటుంబానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాజ్ మహమూద్ కుటుంబ సభ్యులకు రూ.1 లక్ష విలువైన చెక్కును ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, పోలీసు శాఖలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఆరోగ్య పరీక్షలు, జీవనశైలిపై దృష్టి సారించాలని అన్నారు. విధి నిర్వహణలో లేదా అనారోగ్యంతో మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలు, ఇతర ప్రతిఫలాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు కార్యాలయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) మంజ్యా నాయక్, పోలీసు అధికారుల సంఘం సభ్యుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఎర్రగుంట రైతులకు అండగా ఉంటాం

## - కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి : అఖిలపక్ష నేతలు, కార్పొరేటర్లు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూన్ 17 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ఎర్రగుంట చెరువును కబ్జాదారుల నుంచి రక్షించాలంటూ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు సంఘీభావంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్పొరేటర్లు హాజరై రైతులకు మద్దతు ప్రకటించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డా రవికుమార్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కొత్వాల శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు విమలాదేవి, ధర్మసోత్ నరేష్, బి. బాలునాయక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఎర్రంశెట్టి ముత్తయ్య, ముంతపురి రాజుగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, సీపీఐ రైతు సంఘం నాయకుడు నిమ్మల రాంబాబు, రైతు నాయకుడు వై. సాంబశివరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు అరేం ప్రశాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఎర్రగుంట తమ చిన్ననాటి నుంచి చెరువుగానే ఉందని, ఇప్పటికీ చెరువు తూములు, ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చెరువు లేదని చెప్పడం ఆశ్చర్యానికి గురిచేస్తోందన్నారు. చెరువు కబ్జా వ్యవహారంలో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో చెరువు పూడికతీత పనులు, కట్ట బలోపేతం, రోడ్డు నిర్మాణం, రివెట్‌మెంట్ పనులు చేపట్టినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ, వాటికి సంబంధించిన రికార్డులు కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. నీరు నిల్వ ఉండే చెరువులు, కుంటలను మార్చరాదని సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినప్పటికీ, చెరువును మట్టితో పూడ్చేందుకు ప్రయత్నించడం చట్టాలను ధిక్కరించడమేనని విమర్శించారు. చెరువు ఆయకట్టు ఇప్పటికీ సాగులో ఉందని, రైతులు నీటి తీరువా పన్నులు చెల్లిస్తున్నారని తెలిపారు. చెరువు భూములను ఆక్రమించిన వ్యక్తిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, జారీ చేసిన పట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే చెరువు భూములకు రైతుబంధు లబ్ధి కల్పించిన అంశంపై వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు బాధ్యత వహించాలని, చెల్లించిన మొత్తాలను తిరిగి రికవరీ చేయాలని కోరారు. వారం రోజులుగా రైతులు దీక్షలు కొనసాగిస్తున్నప్పటికీ అధికారులు స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు. ఎర్రగుంట రైతుల పోరాటంలో తాము ప్రత్యక్ష భాగస్వాములమవుతామని, కార్పొరేషన్ సమావేశంలో ఈ అంశాన్ని ఎజెండాగా చేర్చి చర్చిస్తామని కార్పొరేటర్లు హామీ ఇచ్చారు. అలాగే రెవెన్యూ, వ్యవసాయ శాఖ మంత్రులను చెరువు వద్దకు తీసుకువచ్చి వాస్తవ పరిస్థితులను పరిశీలింపజేసి, చెరువుకు సంబంధించిన పట్టాల రద్దు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పి. తులసిరాం, కార్యదర్శివర్గ సభ్యులు కాతోజు సత్య, ఉలవలపూడి సత్యవాణి, పట్టణ కమిటీ సభ్యులు బి. కాంతి, వింజా రాములు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు పాల్గొన్నారు.




# బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదలకు కృషి

## - ఆర్టీసీ ఖని డీఎం కవిత

## - వాటర్ కూలర్లు, త్రీ సీటర్ చైర్స్ అందజేసిన ఎన్టీపీసీ (సీఎస్ఆర్-సీడీ)



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూన్ 17 : ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతానని గోదావరిఖని ఆర్టీసీ డిపో నూతన మేనేజర్ సీహెచ్. కవిత తెలిపారు. ఇటీవల గోదావరిఖని డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె బుధవారం మీడియాతో మాట్లాడారు. గోదావరిఖని డిపోతో తనకు దాదాపు 15 సంవత్సరాల అను బంధం ఉందని, ఆర్టీసీలో మొత్తం 26 సంవత్సరాల సేవా అనుభవం కలిగి ఉన్నానని తెలిపారు. గోదావరిఖని బస్టాండ్‌లో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరచడంతో పాటు గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. డిపో అభివృద్ధికి ఉద్యోగులందరూ సహకరిస్తున్నారని, వారి సహకారంతో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని చెప్పారు. కాగా ఎన్‌టీపీసీ సంస్థ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్-సీడీ) కార్యక్రమంలో భాగంగా గోదావరిఖని బస్టాండ్‌కు రెండు వాటర్ కూలర్లు, మూడు త్రీ-సీటర్ కుర్చీలను అందజేసింది. సుమారు రూ.70 వేల విలువైన ఈ సామగ్రిని ఎన్‌టీపీసీ హెచ్‌ఆర్ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ తన హెచ్‌ఆర్ బృందంతో కలిసి డిపో మేనేజర్ కవితకు అందజేశారు. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు చల్లని తాగునీరు అందించడంతో పాటు కూర్చునేందుకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని ఎన్‌టీపీసీ ప్రతినిధులు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది శంకర్, సదానందం, లింగయ్య, తిరుపతి తది తరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సలహాదారు హర్కర జన్మదిన వేడుకలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జూన్ 17 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదార్ హర్కర వేణు గోపాలరావు పరిశ్రమల తల్లి విలేజ్ రామగుండం ముద్దుబిడ్డ పది కాలాలపాటు ప్రజాసేవలో ఉండి ప్రజల మనిషిగా మరింత ఉన్నత పదవుల స్థానంలో ఉండాలని రామగుండం ప్రజలు భావిస్తున్నారని రామగుండం కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ అయేషా వాజిద్ ఖాన్ అన్నారు. బుధవారం రామగుండం తబిత ఆశ్రమ పిల్లల మధ్య కేక్ కట్ చేసి వేణుగోపాల్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన అనంతరం మాట్లాడారు. ప్రభుత్వ సలహాదారుగా హర్కర వేణుగోపాలరావు ప్రభుత్వ పాలన రంగంలో నిరంతరం తనదైన శైలిలో శ్రమిస్తూనే పుట్టిన గడ్డ రామగుండం ప్రాంత అభివృద్ధిపై తగిన సలహాలు సహకారలను అందిస్తూ రామగుండం ప్రజల ప్రేమాభిమానాలను పొందుతున్నారని కార్పొ రేటర్ ఆయేషా వాజిద్ ఖాన్ గుర్తు చేశారు. రామగుండం ప్రజల ఆశీస్సులతో రాబోయే కాలంలో రాజకీయ రంగంలో ఉన్నత పదవుల శిఖరాలను అందుకోవాలని ఆశిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్-2026 కార్యక్రమంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 17 : మహబూబాబాద్ ఆర్డీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో బుధవారం ఎస్టీ నియోజకవర్గ పరిధిలోని వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లిస్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 కార్యక్రమానికి సంబంధించిన అన్ని వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం షెడ్యూల్‌ను వెల్లడిస్తూ, జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తారని తెలిపారు. అనంతరం ముసాయిదా ఓట రు జాబితా ప్రచురణ, క్లెయిమ్స్-అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, తుది ఓటరు జాబితా ప్రచురణ ప్రక్రియలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం నిర్వహించ బడతాయని వివరించారు.

**ఎస్ఐఆర్-2026 షెడ్యూల్:** శిక్షణ, ఎన్యూమరేషన్ ప్రింటింగ్ కార్యక్రమాలు: జూన్ 15 నుంచి 24 వరకు, బీఎల్‌వోల ద్వారా ఇంటింటి సర్వే జూన్ 25 నుంచి జూలై 24 వరకు, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ జూలై 24 లోగా, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జూలై 31, క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ: జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు, క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు అలాగే తుది ఓటరు జాబితా ప్రచురణ అక్టోబర్ 1, 2026 వుంటుదని వివరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ తరఫున సురేష్ నాయుడు, బీఆర్ఎస్ తరఫున మార్నేని వెంకన్న, బీజేపీ తరఫున స్వామి సుందర్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సునీత, బి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కూలీ రేట్లు పెంచకుంటే జూన్

## - 21నుండి సమ్మెలోకి వెళ్తాం

## - హమాలీ వర్కర్స్ యూనియన్ నేత ఎం.ఏ.గౌస్ హెచ్చరిక



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటీ (గోదావరిఖని), జూన్ 17 : గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్ల పెంపు విషయంలో హోల్‌సేల్ వ్యాపారులు మూర్ఖంగా వ్యవహరిస్తున్నారని, జిల్లా లేబర్ కమిషనర్ సూచనలు కూడా ఖాతరు చేయడం లేదని హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.ఏ.గౌస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 20 లోపు కూలీ రేట్లు పెంచాలని, లేకుంటే 21 నుండి సమ్మెలోకి వెళ్తామని ఆయన హెచ్చరించారు. బుధవారం గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో జరిగిన హమాలీ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గోదావరిఖని కూరగా యల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని గత ఏడు సంవత్స రాలుగా పోరాటాలు, ఆందోళన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ హోల్‌సేల్ వ్యాపారులు కూలీ రేట్లు పెంచకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కూలీ రేట్లు పెంపుపై డి.సి.ఎల్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన హోల్‌సేల్ వ్యాపారులు హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కలిసి మాట్లాడుకోవాలని సూచించారని, వారి సూచన మేరకు గత పది రోజుల క్రితం హోల్‌సేల్ వ్యాపారులను సంప్రదించినప్పటికీ వారు పట్టించుకోవడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై హమాలీ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిపి, జూన్ 20 లోపు హోల్‌సేల్ వ్యాపారులు స్పందించి కూలీ రేట్లు పెంచితే సరే, లేకుంటే 21 నుండి సమ్మెలోకి వెళ్తామని ఆయన తేల్చిచెప్పారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, జానీ మియా, గాలి పెల్లి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# వానలు కురవాలనికప్ప తల్లి ఆట కదిలిన రైతన్నలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జూన్ 17 : తెలంగాణ ప్రాంతంలో తాత ముత్తాతల తరాల నుంచి వస్తున్న ఆచారపు ఆట "కప్పతల్లి". వర్షాకాలం ఖరీఫ్ సీజన్ కోసం రోహిణి కార్తిలో తొలకరి చినుకులు మొదలై మృగశిర కార్తిలో ముసురు వర్షాలతో రైతులు మురిసి పోయేవారు.. మృగశిరలో సమృద్ధిగా కురిసే వర్షాలతో రైతులు వారి కుటుంబాలతో వ్యవసాయపు భూముల్లో తొలకరి జల్లుల విత్తనాలను నాటే పనులు బిజీ బిజీగా ఉండడం ఆనవాయితీ.. అయితే మారిన కాలంలో రుతుపవనాలు కేరళ ప్రాంతాన్ని తట్టినప్పటికీ తెలంగాణ జిల్లాలో వర్షపు జాడ లేకపోవడంతో రైతులు ఇప్పుడు పాత ఆచారాన్ని పెద్దల మాటలతో కప్పతల్లి ఆటను తెరపైకి తెచ్చారు. నిత్యం ఇంటిలో వాడుకునే రోకలిబండకు మధ్య తెల్లటి కొత్త గుడ్డలో కప్పను పెట్టి కట్టి ఇద్దరు వృద్ధ రైతులు మోస్తుంటే కదిలి వరుణ దేవున్ని తలుస్తూ ప్రతి ఇంటికి వెళతారు. ప్రతి ఇంటి మహిళలు రోకలిబండ గుడిలో ఉన్న కప్పపై బిందెలతో నీళు పోస్తూ వర్షాలు కురవాలి వాన దేవుడా అంటూ వేడుకుంటారు. అలాగే ఒకరిపై ఒకరు నీళ్లు పోసుకుంటూ ఊరు ఊరంతా తడిసి ముద్దవుతుంది. ఇంతటి ప్రాధాన్యత గల కప్పతల్లి ఆట ఇప్పుడు రామగుండం కార్పొరేషన్ పరిధి 29వ డివిజన్ లింగాపూర్ గ్రామంలో రజని రవి ఆధ్వర్యంలో రైతులు కప్పతల్లి ఆటపాటలతో గ్రామ తొలి దేవత పోచమ్మ తల్లికి హనుమాన్ బొడ్రాయిలకు నీటి అభిషేకం చేసి కప్పతల్లి ఆట సంబరాలను ఘనంగా నిర్వహించారు. పాతతరం సాంప్రదాయ కప్పతల్లి ఆటను ఈ తరం యువత ఆసక్తిగా చూస్తూ కప్పతల్లి ఆట చరిత్రను తెలుసుకునే ప్రయత్నం చేయడం ఈ తరానికి ఈ ఆట పరిచయం చేసిన ఘనత లింగాపూర్ ప్రజలకు దక్కుతుంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇరికిల్ల శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు అర్సనపల్లి శ్రీనివాస్, గంగారపు వెంకన్న, పులి లక్ష్మయ్య, కందుల నారాయణ, కొక్కుల శంకర్, ఇజ్జగిరి కనకయ్య, అరసనపల్లి భీమ లింగు, రాయమల్లు, గోపతి నారాయణ, అర్సనపల్లి మల్లేష్, అర్సనపల్లి వెంకటేష్, చొప్పదండి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పై బీఎల్వో, బిఎల్ఏ లకు అవగాహన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 17 : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పై బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ మీటింగ్ హాల్ లో జగిత్యాల అర్బన్, రూరల్ మండలములోని బూత్ లెవెల్ అధికారులు (బిఎల్వో), బిఎల్వో సువర్వైజర్లు, బూత్ లెవెల్ ఏజెంట్స్ (బిఎల్ఏ) లకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జగిత్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి, తహశీల్దార్ ల ఆధ్వర్యంలో ఏసి ఎల్ఏంటి జెడ్పీ హెచ్ఎస్ పోరండ్ల స్కూల్ అసిస్టెంట్ రాజశేఖర్ శిక్షణ ఇచ్చారు. బూత్ లెవెల్ అధికారులు (బిఎల్వో), బిఎల్వో సువర్వైజర్లు, బూత్ లెవెల్ ఏజెంట్స్ (బిఎల్ఏ) ల యొక్క విధులు, బీఎల్వో యాప్ పై పూర్తి అవగాహన కల్పించారు. ఇంటింటి గణన, ప్రతి బీఎల్వో ఇంటింటి గణన సమయములో ఐడి కార్డులను తప్పని సరిగా దరించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారం నింపే విదానము, ఒక్క కుటుంభములోని ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ స్టేషన్ లో ఉండే విదముగా చూడాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారంను ఇంటింటికి పంపిణీ చేయుట. ఒక్క ఇంటిని మూడు సార్లు సందర్శించవలెనన్నారు. ఎన్యుమరేషన్ ఫారం ఓటరు వద్ద నుండి తిరిగి తీసుకొనేటప్పుడు ఎలెక్టోరల్ సంతకము ఉండేలా చూడవలెనన్నారు. బీఎల్వో ఇంటింటి గణన నిర్వహించేటప్పుడు 10 ఫామ్ 06 మరియు 10 డిక్లరేషన్ ఫామ్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ పైన తెలిపిన అంశములపై బూత్ లెవెల్ అధికారులు (బిఎల్వో), బిఎల్వో సువర్వైజర్లు, బూత్ లెవెల్ ఏజెంట్స్ (బిఎల్ఏ) లకు పూర్తి అవగాహన కల్పించారు.



# రాష్ట్ర స్థాయి ర్యాంకులతో మెరిసిన వనపర్తి స్కాలర్స్ కాలేజ్ విద్యార్థులు

## - ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూన్ 17: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి వనపర్తి జిల్లాకు గర్వకారణంగా నిలిచిన వనపర్తి స్కాలర్స్ కాలేజ్ విద్యార్థులను మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభినందించారు. కాలేజ్‌కు చెందిన చావ భవ్యశ్రీ (బైపిసి) 438 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్, డి. పల్లవి (బైపిసి) 437 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్ సాధించి విశిష్ట ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు పట్టుదలతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయాలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల అంకితభావం, కృషి ప్రధాన కారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించి జిల్లా, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల ఈ విజయాలు వనపర్తి జిల్లాకు గర్వకారణమని, స్కాలర్స్ కాలేజ్ విద్యా ప్రమాణాలకు నిదర్శనమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ఉంగ్లం తిరుమల్, ప్రేమ్ నాథ్ రెడ్డి, నరసింహ, చిట్యాల రాము, ఎండీ అలీమ్, ఆర్. చంద్రశేఖర్, సేనాపతి, నిరంజన్, వంశీ, యది తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com